ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




బుధవారం 26 ఆగస్టు 2026 | Wednesday 26 August 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 136 | Vol.No 28 Issue No .136 | www.visionandhra.in

## సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

- వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడి జరగాలి
- నీట్ పరీక్ష పక్కాగా జరిగేలా చర్యలు
- కలెక్టర్లకకు సిఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం



హైదరాబాద్,ఆగస్ట్25: సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలనిఅధికారులకు సీఎస్ సంజయ్ జాజు సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మిగతా 2లో..

## త్వరత్వరగా మూసీ భూసేకరణ

- న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్వహణ, • అధికారుకు సిఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్,ఆగస్టు 25 : మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించు కోవాలన్నారు. మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత మిగతా 2లో..

## తెలంగాణ మోడల్‌లో కులగణన

- జనగణనలో కులగణన విధానం సరిగా లేదు
- ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు
- ప్రధాని మోడీకీ రాహుల్, ఖర్గేల లేఖ

న్యూఢిల్లీ,ఆగస్టు 25 : జనగణన పద్ధతిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఖర్గే, రాహుల్ సుదీర్ఘ లేఖ మిగతా 2లో..



# కొండా సురేఖ, చిన్నారెడ్డి ఔట్ ?

- ఆ ఇద్దరిపై వేటుకు క్రమశిక్షణ కమిటీ నిర్ణయం
- నివేదికలో కఠిన చర్యలకు సిఫార్సులు
- పిసిసి చీఫ్‌కు నివేదిక అందించిన మల్లు రవి
- కాంగ్రెస్‌లో క్రమశిక్షణ ముఖ్యమని స్పష్టీకరణ
- పార్టీలైన్ దాటితే చర్యలు ఉండాల్సిందేనని వెల్లడి
- కేంద్ర కమిటీ తీసుకునే నిర్ణయాలను బట్టి చర్యలు
- మీడియా సమావేశంలో క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవి



హైదరాబాద్,ఆగస్ట్25 : కాంగ్రెస్‌లో రెండు వికెట్లు పడబోతున్నాయి. కాంగ్రెస్ క్రమశిఓణు ఉల్లంఘించిన ఇద్దరు నేతలను ఆయా పదవుల నుంచి తొలగించబోతున్నారు. పిసిసి క్రమశిక్షణా కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉండబోతున్నాయని తెలుస్తోంది. ఈ కక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ కమిటీ రూపొందించిన నివేదిక పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందింది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ ఈ నివేదికను మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలకు కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మొత్తంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కి క్రమశిక్షణా కమిటీ సమర్పించిన నివేదిక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. బీసీ సంక్షేమ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డిలను వారి పదవుల నుంచి తక్షణమే తప్పించాలని కమిటీ తన నివేదికలో స్పష్టంగా సిఫార్సు చేసినట్లు సమాచారం. వీరిద్దరి వైఖరి, వివాదాస్పద వ్యాఖ్యలు , శైలి వల్ల పార్టీకి మాత్రమే కాకుండా, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజల్లో తీవ్ర చెడ్డపేరు వస్తోందని కమిటీ తన నివేదికలో కుండబద్దలు కొట్టింది. సీనియర్ నాయకులుగా ఉండి పార్టీ రహితమైన, వివాదాస్పద రీతిలో ప్రవర్తించడం వల్ల ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతింటోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పదవుల నుంచి తొలగించాలని సిఫార్సు.. మిగతా 2లో..

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

- ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి
- మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి
- నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ



న్యూఢిల్లీ,ఆగస్ట్25 :అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ మిగతా 2లో..

## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- సిఎం రేవంత్‌కు బాధ్యతారాహిత్యం కూడదు
- బిజెపి సభలో ఎంపి ఈటలె రాజేందర్ విమర్శలు
- స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం

మిగతా 2లో..



## పల్లె పల్లెకు ప్రజాపాలన.. పల్లె పల్లెకు పొన్నం' కార్యక్రమం

- గ్రామాల్లో పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులకు దిక్కేలేదని విమర్శ



సిద్దిపేట,ఆగస్టు 25 : బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా అర్హులకు అందలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సైదాపూర్ మండలంలోని పలు గ్రామాలలో 'పల్లె పల్లెకు ప్రజాపాలన.. పల్లె పల్లెకు పొన్నం' కార్యక్రమంలో భాగంగా సర్వాయిపేట, పెరిక మిగతా 2లో..

# వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

- నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలి
- ప్రతి ఒక్కరికి పని కల్పించి ఆదుకోవాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క



హైదరాబాద్,ఆగస్టు 25 : రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇచ్చిన టా÷-గ్గ÷ట్‌లో 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశర చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ మిగతా 2లో..

## ఫీజులే చెల్లించరు.. విదేశీ విద్య ఎలా వస్తుంది

- లక్షలాది విద్యార్థుల మానసిక క్షోభ అర్థం కావడం లేదా
- ఫీజు చెల్లింపులపై బండి విమర్శలు



హైదరాబాద్,ఆగస్టు 25 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదని.. విదేశీ విద్యను అందిస్తానంటే నమ్మేదెలా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఫీజు బకాయిలు అందక ఉన్న కాలేజీలే మూత పడుతున్నాయని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రప్పిస్తాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభ సీఎంకు పట్టదా అని నిలదీశారు. 'సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు.. విద్యార్థులకు చేస్తున్న మిగతా 2లో..

## ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

- మాదక ద్రవ్యాలు వినియోగించకుండా ఆంక్షలు
- టెస్ట్ వ్యవహారాలను పరిశీలిస్తున్న డిజిసి
- కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ,ఆగస్టు 25 : ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులునిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ మిగతా 2లో..

## స్థానిక ఎన్నికల్లో పట్టుదలగా పనిచేయాలి

- నియోజకవర్గాన్ని వదిలి బయటకు వెళ్లరాదు
- ఎన్నికల్లో గెలుపు వైసిపికి అత్యంత ముఖ్యం
- అధికార దుర్వినియోగం జరగకుండా అడ్డుకోవాలి
- పార్టీ ముఖ్యనేతలతో ఎన్నికలపై జగన్ దిశానిర్దేశం



అమరావతి,ఆగస్ట్25 : స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ప్రజలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు ఇస్తారని అన్నారు. గతంలో స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశామని పేర్కొన్నారు. స్థానిక మిగతా 2లో..

## శ్రీశైలం వడ్డెర సత్రంలో దారుణం


- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య
- నెలరోజులుగా సత్రంలోనే ఉండడంపై అనుమానాలు
- దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు



నంద్యాల,ఆగస్టు 25 :శ్రీశైలంలో విషాద ఘటన చోటు చేసుకుంది. శ్రీశైలం వడ్డెర అన్నదాన సత్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఊరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం మిగతా 2లో..

# పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం

- ఎపిలో సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం
- అనంతపురం జిల్లాలో సుజ్లాన్ విండ్ పవర్‌కు శంకుస్థాపప
- పవన్ విద్యుత్‌లో పలువురికి ఉద్యోగావకాశాలు: లోకేశ్ వెల్లడి




అనంతపురం,ఆగస్ట్25 : ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అదనంగా 1.3 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుజ్లాన్ గ్రూప్ పెట్టుబడులు పెడుతోందని నారా లోకేష్ వెల్లడించారు. ఉరుకొండ వద్ద ఉన్న బ్లేడ్ల తయారీ యూనిట్ విస్తరణతో పాటు కొత్త ప్రాజెక్టుల ద్వారా దాదాపు 4,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. 2016లో ప్రారంభమైన అనంతపురం సుజ్లాన్ ప్లాంట్ ద్వారా ఇప్పటికే సుమారు 2,000 మందికి ఉపాధి లభించిందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో దాదాపు 70 శాతం మంది స్థానిక యువత ఉండటం సంతోషకరమన్నారు. స్థానిక ఐటీఐలను దత్తత తీసుకుని శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సుజ్లాన్ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 40 శాతం మంది మహిళలు ఉండటం అభినందనీయమని నారా లోకేష్ అన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరగడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులతో నెలవారీ సమావేశాలు మిగతా 2లో..

## శ్రీశైలం వడ్డెర సత్రంలో దారుణం

కలకలం రేపుతోంది. గత 3 రోజులుగా రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో పాటు దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన సత్రం నిర్వాహకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు తెరచి చూడగా బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు, ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరివేసుకొని కనిపించారు. మృతులు సుధాకర్(36), గోగుల ఆదిలక్ష్మి(50), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), మణికంఠ(15)గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. శ్రీశైలం వడ్డెర సత్రంలో సంఘటనా స్థలాన్ని ఆలయ ఈవో శ్రీనివాసరావు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పరిశీలించారు. సుధాకర్ కుటుంబ సభ్యులు.. గత నెల 28వ తేదీన శ్రీశైలం వడ్డెర సత్రం రూమ్ నెంబర్ 11లో రూ. 800 చెల్లించి అద్దెకు తీసుకున్నారు. రెండు రోజుల తర్వాత ఖాళీ చేయాలని సత్రం నిర్వాహకులు చెప్పినప్పటికీ.. అనారోగ్యంతో వచ్చామని, మరికొద్ది రోజులు ఉండి పూజలు చేయించుకుంటామని సుధాకర్ చెప్పినట్లు సమాచారం. రోజుకు 800 రూపాయలు చెల్లిస్తూ వ్డడెర సత్రంలోనే సుధాకర్ కుటుంబ సభ్యులు ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులు సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఐదుగురి మృతదేహాలను కిందకు దించిన శ్రీశైలం పోలీసులు.. శవ పరీక్షల కోసం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వడ్డెర సత్రం యాజమాన్యం.. యాత్రికులకు నెల రోజులపాటు రూమును ఎందుకు అద్దెకు ఇచ్చారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతిచెందిన వ్యక్తులు శ్రీశైలంలో నెల రోజులపాటు ఎందుకు ఉన్నారనే కోణంలోనూ విచారణ చేపట్టారు.

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు. అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు. ఇది సాధారణ పక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యనించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మామ్ధానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు. గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు. కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## పల్లె పల్లెకు ప్రజాపాలన.. పల్లె పల్లెకు పొన్నం' కార్యక్రమం

పల్లి, గొల్లగూడెం, ఆకునూరు, వెంకటేశ్వర్ల పల్లి గ్రామాలలో పర్యటించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. ప్రజా పాలనలో రైతు సంక్షేమంతో పాటు, రాష్ట్రంలో అనేక వినూత్న పథకాలను అమలు చేస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు, పేదలకు సన్న బియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పంటి కార్యక్రమాలను చేపడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతంగా పనిచేస్తుందన్నారు.అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం జరిగింది. అర్హులైన లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. గ్రామంలో 8 ఇందిరమ్మ ఇళ్లు పూర్తవడం, రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల ద్వారా లబ్ది చేకూరడం జరిగింది. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, తాగునీరు, వాటర్ ఎ÷-లాంట్, పంచాయతీ భవనం తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని అధికారులకు సూచించడం జరిగింది. జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించడం జరిగింది. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునివ్వడం జరిగింది. గొల్లగూడెం గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచులు స్వరూప, బాబిత, మౌనిక, స్వతంత్ర, చంద్రయ్య, మండల డివిజన్ జిల్లా స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఔఓ÷ూ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశర చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశిరచారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశిరచి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశిరచారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

## ఫీజులే చెల్లించరు. విదేశీ విద్య ఎలా వస్తుంది

అవమానాలు కనిపించడం లేదా? ఫీజు బకాయిలు అడిగితే కాలేజీ యాజమాన్యాలను బెదరించడం తప్ప కాంగ్రెస్ సర్కార్ సాధించిందేమిటన్నారు. ఫీజు రీయింబర్స్ బకాయిల వల్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నా పట్టదా? ఇందిరమ్మ రాజ్యమంటే దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్యకు దూరం చేయడమేనా? వన్ టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది?' అంటూ బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. మామిలిచ్చి మోసం చేయడంలో బీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోతున్నారని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే బీజేపీ స్టేట్ చీఫ్ రాంచంద్రరావు 'ఫీజు బకాయి– బీజేపీ లడాయి' దీక్ష చేపట్టారని చెబుతూ.. ఆయన 'దీక్ష'కు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారన్నారు. రాంచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేదాకా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

## త్వరత్వరగా మూసీ భూసేకరణ

త్వరగా టెండర్‌లను పిలవాలని తెలిపారు. ప్రాజెక్ట్‌లకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. త్వరగా పనులు జరిగేలా చూడాలన్నారు. పనుల్లో ఆలస్యం తగదని, నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టుల పూర్తికి ముందుకు సాగాలని అన్నారు. హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహ రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కొండా సురేఖ, చిన్నారెడ్డి ఔట్ ?

అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఐక్యతను కాపాడటానికి, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని క్రమశిక్షణా కమిటీ అభిప్రాయపడింది. అందుకే మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని, అలాగే చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించాలని సిఫార్సు చేస్తూ ఉన్నత స్థాయికి నివేదికను పంపినట్లు తెలుస్తోంది. క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన ఈ కీలక నివేదిక కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ అధిష్ఠానం ఏ విధమైన కఠిన నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో నెలకొంది. నివేదిక సమర్పించిన అనంతరం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణ ఆధారంగా పీసీసీ అధ్యక్షుడికి నివేదిక ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ గౌరవాన్ని దెబ్బతీసే పనులు ఎవరూ చేయొద్దని.. వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడవద్దన్నారు. అన్ని అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇచ్చాం. హద్దులు దాటిన నేతలందరికీ స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాల్సిన అవసరం ఉంది. క్రమశిక్షణా

చర్యలు కఠినంగా ఉండాలని నివేదిక ఇచ్చాం అన్నారు. అందులో ఏముందో ముందే చెబితే అధిష్ఠానం నుంచి నాకు నోటీసులు వస్తాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలను ఎవరూ బయటపెట్టొద్దని ప్రధానంగా నివేదికలో పేర్కొన్నాం. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యక్తిగతంగా కలవలేదు. గాంధీభవన్‌లో వివరణ లేఖ ఇచ్చి వెళ్లారు. ఈ నివేదికను సీఎం రేవంత్‌కు ఇవ్వలేదు. పార్టీకి సంబంధించిన విషయం కాబట్టి పీసీసీ అధ్యక్షుడికి అందజేశాం. ఈ విషయంలో ఊహాజనిత అంశాలు ప్రచారం చేయొద్దని మల్లు రవి అన్నారు. అయితే కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పీసీసీ అధ్యక్షుడికి సమర్పించిన నివేదికలో క్రమశిక్షణ కమిటీ పలు సిఫార్సులు చేసినట్లు సమాచారం. పార్టీ నియమాలను కొండా సురేఖ ఉల్లంఘించడం ఇది మూడోసారి. ఇంకా ఉపేక్షిస్తే పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుందని, సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని సిఫార్స్ చేసినట్లు తెలుస్తోంది. సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డి పార్టీలో సుదీర్ఘకాలం ఎన్నో పదవులు అనుభవించారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఆయన కూడా పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడారు. క్యాబినెట్ ర్యాంకు పదవిలో ఉన్న చిన్నారెడ్డిని కూడా ఆ పదవి నుంచి తొలగించాలని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. కమిటీ నివేదిక నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలపై కాంగ్రెస్ పార్టీ

తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలతో నివేదికను పొందుపరిచి టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు అందజేశారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పంపారని తెలిపారు.

మంగళవారం వీరిపై మీడియాలో వచ్చిన కథనాలను చూసి ఓ అంచనాకు వచ్చామని మల్లు ర వి పేర్కొన్నారు. అలాగే గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపిస్తారని అన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కమిటీలో క్రమశిక్షణ ప్రధానమైనదని పేర్కొన్నారు. క్రమశిక్షణపైనే పార్టీ గౌరవం ఆధారపడి ఉంటుందన్నారు. ఆ గౌరవం ఉంటేనే మళ్ళీ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. అధిష్ఠానం దీనిపై సమీక్షించి ఏ నిర్ణయం తీసుకున్నా, ఆ వివరాలను మీడియా ద్వారా వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

## .స్థానిక ఎన్నికల్లో పట్టుదలగా పనిచేయాలి

ఎన్నికలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దని జగన్ సూచించారు. ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కాదని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన ఎన్నికలని అన్నారు. అధికార పార్టీ నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, దౌర్జన్యాలు ఎదురైనా నాయకుడు తమ వెంట ఉన్నాడనే భరోసా కార్యకర్తలకు కల్పించాలని సూచించారు. పార్టీ ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు జగన్.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు హాజరయ్యారు..ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్,

మేయర్ వంటి కీలక పదవులకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని పార్టీ నేతలకు సూచించారు. అవసరమైన చోట కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను కూడా పోటీలోకి దింపడానికి వెనుకాడవద్దని అన్నారు. ఏకగ్రీవాలకు అంగీకరిస్తే కఠిన నిర్ణయాలు ఉంటాయని జగన్ హెచ్చరించారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలు జరిగేందుకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి కో–ఆర్డినేటర్లు పార్టీ అభ్యర్థులుగా ఉండరని తెలిపారు. ఎన్నికల అనంతరం అభ్యర్థులను ఎక్కడెక్కడ నిలబెట్టారు, వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారనే అంశాలపై నివేదికలు తీసుకుంటానని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో అభ్యర్థి వ్యక్తిగత బలం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో భావోద్వేగాలు, వ్యక్తిగత ఈగోలకు తావివ్వకుండా అందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. ఒక్కో ఓటు కూడా కీలకమని, తొమ్మిది ఓట్లతో గెలిచిన సందర్భాలు, తొమ్మిది ఓట్లతో ఓడిన సందర్భాలు

ఉన్నాయని గుర్తుచేశారు. 'గెలుపే ముఖ్యం.. గెలుపు కోసం ఈగోలను పక్కన పెట్టాలి' అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి, సమర్థుడైన కార్యకర్త చుట్టూ ఏకాభిప్రాయం తీసుకురావాలని జగన్ సూచించారు. రాబోయే 60 నుంచి 70 రోజులు నాయకులు తమ నియోజకవర్గాలను దాటి వెళ్లకుండా స్థానిక ఎన్నికలపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని అన్నారు. ఇంటింటి ప్రచారం ద్వారా వైఎస్సార్‌సీపీ పాలన, కూటమి పాలన మధ్య ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పోలీసు అధికారులు తమ పదవులను దుర్వినియోగం చేయకుండా న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జగన్ కోరారు. కార్యకర్తలను వేధించే లేదా అన్యాయం చేసే అధికారుల వివరాలను నమోదు చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపై భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తటస్థంగా వ్యవహరించాలని కోరారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

## సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయసాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ, తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ వ్యూహంలో భాగంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులను సిఎస్ ఆదేశించారు. నెల 30వ తేదీన జరగనున్న ప్రవేశ పరీక్ష సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా

నిర్వహించేందుకు జిల్లాల్లో చేపడుతున్న ఏర్పాట్లను సీఎస్ సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. హైదరాబాద్, మేడ్చల్ –మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 30 సెంటర్లలో ఈ పరీక్ష జరగనున్నందున కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, నిరంతర విద్యుత్ సరఫరా, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ టూరిజం 2047 పాలసీలో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలో ఉన్న ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పరిశుభ్రత, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాల ప్రత్యేకతలు, చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ÷ూష్ట్రంలో టూరిజం అభివృద్ధి కి 27 స్పెషల్ టూరిజం ప్రదేశాలు(ఎస్‌టిఎ)లను గుర్తించిందని, ఆ ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి టూరిజం సెక్టార్ ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని సిఎస్ అన్నారు. తెలంగాణ బ్రాండ్ ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు ఈ టూరిజం 20247 ప్రణాళికలు ఎంతో ఉపయోగపడుతాయని ఆయన అన్నారు. స్పిర్చువల్ , హెరిటేజ్, ఎకోటూరిజం, క్రాఫ్ట్ టూరిజం విస్తరణకు అధికారులు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్పెషల్ సిఎస్(జం÷ుఅ) వాణిప్రసాద్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తూ, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పోలీస్ శాఖ డిజి మహేశ్ భగవత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం

నిర్వహించి పరిశ్రమలకు ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక అడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. పెట్టుబడులు ఆలస్యం కాకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగానికి అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారా లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండలం హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్ట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అలాగే సుజ్లాన్ 144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్‌ను ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ సంస్థ రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సుజ్లాన్ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో సుజ్లాన్ ఇప్పటికే కీలక పవన్ విద్యుత్ సంస్థగా ఎదిగింది. ఏపీలో ఈ సంస్థకు 1700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యం ఉంది. ఇది 2030 నాటికి అదనంగా 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని సుజ్లాన్ ప్రణాళికలు రూపొందించింది. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకునేందుకు ఈ సంస్థ ముందుకు సాగుతోంది.

## ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

నాయుడు తెలిపారు. పైలట్లు మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అరికట్టేందుకు, భవిష్యత్తులో కఠినమైన నిబంధనలు తెచ్చేందుకు డీజీసీఏ ప్రస్తుతం విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోందని చెప్పు కొచ్చారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్‌కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్–ఢిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని పైలెట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్‌లాండ్ నుంచి ఢిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్–ఇన్– కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. విమానం డేటా రికార్డర్లు, ఇతర భాగాలు సురక్షితంగా ఉన్నందున, త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పైలట్ నెట్‌వర్క్‌లో కేవలం పదిశాతం మందికి మాత్రమే రాండమ్‌గా డోప్ టెస్టులు నిర్వహిస్తున్నారని రామ్మోహన్ వెల్లడించారు. ప్రతీ పైలట్‌కు సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా రాండమ్‌గా పరీక్ష నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. విమాన ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. విమాన సంస్థల ఆపరేషనల్ ప్రభావం కూడా దెబ్బతినకుండా ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## తెలంగాణ మోడల్‌లో కులగణన

రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కులగణలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులాల నమోదుకు 'ఓపెన్–ఎండెడ్' విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కులాల లెక్కింపు విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే కులం వేర్వేరు పేర్లతో విడిపోయి లక్షలాది కులాల పేర్లుగా నమోదవుతాయని.. దీనివల్ల లెక్కింపు డేటా పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని తెలిపారు. ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదమే లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీ, ఓబీసీ కులాల నమోదుకూ 'డ్రాప్–డౌన్ జాబితా' విధానాన్ని ఉపయోగించాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) సర్వేల్లో వాడిన కులాల జాబితా నమూనాలను ప్రధానికి పంపించారు. ప్రస్తుత గందరగోళ ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి, అన్ని పార్టీలు – నిపుణులతో చర్చించి ఓ కొత్త ప్రశ్నావళిని రూపొందిం చాలని ఖర్గే, రాహుల్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖాల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి. 2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

హైదరాబాద్,ఆగస్టు 25 : 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి – భాజపా లడాయి' పేరుతో భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు. పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి–భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

**పాస్ పోర్ట్ పోయినది**

నేను అనగా శ్రీ పసుల రంగారెడ్డి తండ్రి పసుల రాంరెడ్డి, వయస్సు: 48 సంవత్సరాలు,ఇంటి నెంబర్:18-88, ఝాన్సీ లక్ష్మి బాయ్ రోడ్, కల్వకుర్తి, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.. నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ S9263257 నేను తేదీ: 16.08.2026 రోజున కల్వకుర్తి నుండి హైదరాబాద్ బస్ ప్రయాణంలో పోయినది. పై పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికినచో ఫోన్ చేయగలరు.
ఫోన్ నెం: 9440028028

# సంపాదకీయం

## ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం !

అమెరికా, ఇరాన్ యుద్ధంలో కొత్త అధ్యాయం మొదలయ్యింది. ఇరాన్‌ను ఆయుధాలతో దెబ్బతీయడం కుదరని పని అని అమెరికాకు తెలిసొచ్చింది. దీంతో ఇక ఆర్థిక యుద్ధం మొదలు పెట్టింది. దీంట్లోనూ ప్రపంచ దేశాలను లాగే యత్నం చేస్తోంది. ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకునే దేశాలపైనా ఆంక్షలు కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయుధంతో పోరాటమైనా, ఆర్థిక పోరాటమైనా తన పంతమే నెగ్గాలన్నది ట్రంప్ వాదనగా ఉంది. నేను చెప్పినట్లు వినాలన్న ధోరణితో అమెరికా ఇప్పుడు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెం ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి–డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై కొన్నినెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్రరాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించడం కొత్తేం కాదు. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యూఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ విశ్వాసం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేదన్నారు. అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూ నమ్మరు. అమెరికా ఆంక్షలప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారని పేర్కొన్నారు.యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణాత్మక వైఖరి కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరించలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హోర్ముజ్ జలసంధి నుంచి చుక్కనూనె కూడా బయటకు వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. మరోవైపు ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానీజాదేహ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు మరో ఓటమి తప్పదు. వాషింగ్టన్ విధించిన కొత్త ఆంక్షలను ఎదుర్కోవ డానికి మా వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉంది. ఇరాన్ ప్రజలు, దేశ అధికారుల సంకల్పాన్ని పరీక్షించడానికి వారు చేయగలిగిందంతా చేశారు. కానీ ప్రతిసారీ విఫలమయ్యారని యూఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది.

# అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



నిజామాబాద్, ఆగస్టు25:( విజన్ ఆంధ్ర)ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలుస్తున్న అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ (ఆర్‌డీఎఫ్) సేవలు ప్రశంసనీయమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.నిజామాబాద్‌లో అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పసిపిల్లల కుటుంబాలకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.నిరుపేద చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని గవర్నర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఫౌండేషన్ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. 'వసుధైవ కుటుంబకం' స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు.లబ్ధిదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేయాలని ఫౌండేషన్‌కు సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, ప్రజలు సమష్టిగా పనిచేస్తే అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరుతాయని అన్నారు.ఈ సందర్భంగా అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ధర్మపురి అరవింద్‌ను గవర్నర్ అభినందించారు.ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ కుమార్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను వివరించారు. పసిపిల్లల కుటుంబాలకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమానికి హాజరైనందుకు గవర్నర్ కు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్,ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పి. రాకేశ్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు

# బీసీ సంక్షేమ కమిటీ ప్రాథమిక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

## బీసీ ల సమస్యలు, హక్కులు, సంక్షేమం పై చర్చ



నిజామాబాద్ ఆగస్టు25:( విజన్ ఆంధ్ర)తెలంగాణ శాసనసభలో వెనుకబడిన తరగతులసంక్షేమ కమిటీ (2026–27) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రాథమిక సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొన్నారు.తెలంగాణ శాసన పరిషత్ సమావేశ మందిరంలో శాసన మండలి (లెజిస్లేచర్) వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమం, వారి సమస్యలు, అభివృద్ధి, హక్కులు తదితర అంశాలపై చర్చించారు. బీసీలకు విద్య, ఉపాధి, ఆర్థిక మరియు సామాజిక రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు అభిప్రాయాలను పంచుకున్నారు.రాష్ట్రంలోని వెనకబడిన వర్గాల అభివృద్ధికి ఈ కమిటీ ప్రత్యేకంగా ప్రభుత్వానికి పతిపాదనలు, సలహాలు, సూచనలు అందించనుందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు.బీసీ సంక్షేమశాఖకు కేటాయించిన బడ్జెట్ నిధుల వినియోగం, రాష్ట్రంలోని బీసీ వర్గాల విద్యార్థుల విద్యా, వసతి గృహాల్లో వసతులు, అదేవిధంగా వారి సంక్షేమపథకాలు స్థితిగతులు తదితర అంశాలపై ఈ కమిటీ పర్యవేక్షణ ఉంటుందని.. అందులో భాగంగానే కమిటీ తొలి సమావేశాన్ని ఈరోజు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ , రాష్ట్ర ఐటి పరిశ్రమలు మరియు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కమిటీ చైర్మన్ మక్కన్ సింగ్ ఠాకూర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు దేశాల జీడీపీ కంటే ఇండియన్ బిజినెస్ మ్యాన్ ఆదాయమే ఎక్కువ

ముంబై, ఆగస్టు 25భారత్‌లోని అత్యంత ధనిక కుటుంబాల జాబితా వెలువడింది. 2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూయబుల్ ఫ్యామిలీ బిజినెస్‌లో భారత కుబేరుల జాబితా విడుదలైంది. ఈ లిస్టులో మొదటి స్థానంలో అంబానీ కుటుంబం, రెండో స్థానంలో అదానీ కుటుంబం ఉన్నాయి.ఈ జాబితా ప్రకారం, భారత్2లోని టాప్ 10 ధనిక వ్యాపార కుటుంబాల మొత్తం సంపదను కలిపితే 70.5 లక్షల కోట్లు అవుతుంది. లిస్టులోని టాప్ 300 కుటుంబాల మొత్తం సంపద విలువ 138 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో ఒక్క అంబానీ కుటుంబం వద్దే 25.8 లక్షల కోట్ల రూపాయల ఆస్తి ఉంది. రెండో స్థానంలో గౌతమ్ అదానీ ఉన్నారు. వారి సంపద విలువ 19.6 లక్షల కోట్ల రూపాయలు. 138 లక్షల కోట్ల మొత్తాన్ని ఒక దేశ జీడీపీగా పరిగణిస్తే, అది ప్రపంచంలో 18వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది. ఈ సంపద సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, పోలాండ్, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల మొత్తం జీడీపీ కంటే ఎక్కువ.2025–26 ఆర్థిక సంవత్సరానికి భారతదేశ నామమాత్ర జీడీపీ 3.92 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు 328 లక్షల కోట్లు)గా ఉంది.

# పెంట్లవెల్లి కస్తూరిబాలో ముగ్గురు ఉపాధ్యాయినీల మధ్య వివాదం?

**ప్రశ్నార్థకంగా మారిన పెంట్లవెల్లి కస్తూర్బా విద్యార్థుల జీవితాలు?**

**విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే తరచు గొడవ పడితే ఎలా?**

**జిల్లా విద్యాశాఖ అధికారి తనిఖీ లోపమే ఈ గొడవలు కారణమా?**




కొల్లాపూర్ ఆగస్టు 25 : (విజన్ ఆంధ్ర) ఎక్కడైనా ప్రభుత్వ కస్తూర్బా గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చిన్న చిన్న గొడవలు పడుతుంటారు అది మనకు తెలిసిన విషయమే, అలాంటి గొడవలు పడుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు వాళ్లను సరైన మార్గంలో తీర్చిదిద్దుతూ వారికి విద్యాబుద్ధులను నేర్పిస్తుంటారు. కానీ విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కొందరు ఉపాధ్యాయులే విద్యార్థుల మధ్య గొడవలు పడుతున్నారు. వార్త పూర్తి వివరాలకు వెళితే, నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి గ్రామ శివారులో ఉండే కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం ముగ్గురు ఉపాధ్యాయినీల మధ్య వివాదం జరిగింది. విషయం వెలుగులోకి రావడంతో కస్తూర్బా పాఠశాలకు చేరుకున్న పత్రిక విలేకరులకు అక్కడ డిఇఓ రమేష్ కుమార్ ,జిల్లా కస్తూర్బా అధికారిని నిర్మల , పెంట్లవెల్లి నోడల్ ఆఫీసర్ కురుమయ్య లు అప్పుడే పాఠశాలకు వచ్చి ఇరువురికి గొడవ పడొద్దు అని చెప్పి ఎక్సమినేషన్ రాసి ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్పి వెళ్లినట్లు విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా సమాచారం వెలుగులోకి వచ్చింది. గత ఎస్ఓ కొన్ని రోజుల క్రితం బదిలీపై పెద్దకొత్తపల్లికి కేజీబీవీకి వెళ్ళింది . ఆమె లేని లోటు అదే పాఠశాలకు చెందిన కొందరు ఉపాధ్యాయులకు ఎస్ ఓ బాధ్యతలతో పాటు ఇతర బాధ్యతలను ఇచ్చారు.ఆ ఉపాధ్యాయినీలు ఎస్ ఓ నేనంటూ, ఎస్ ఓ ను నేను అంటూ, వాళ్ల మధ్య వర్గ పోరు మొదలై అది కాస్త గొడవకు దారి తీసింది, మంగళవారం ఇరువురు ఉపాధ్యాయులు గొడవ పడ్డారు, ఆ గొడవ కాస్త పెద్దదై మంత్రి జూపల్లి దృష్టికి వెళ్లడంతో దాన్ని వెలుగులోకి రానివ్వకుండా జిల్లా అధికారినీ వెంటనే కస్తూరిబా పాఠశాలకు పంపించినట్లు విశ్వసనీయ సమాచారం తెలుస్తుంది.

**ప్రశ్నార్థకంగా మారిన కస్తూర్బా విద్యార్థినిల జీవితాలు?**

తల్లిదండ్రుల తర్వాత గురువులే దేవుళ్ళుగా భావించి పేద మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు తమ విద్యార్థులను కస్తూర్బా, గురుకుల పాఠశాలలో చేర్పించి చదివిస్తుంటే విద్యార్థులకు చక్కటి విద్యాభ్యాసాన్ని అందించాల్సిన కొందరు ఉపాధ్యాయులు వాళ్ల వ్యక్తిగత ఇతర కారణాలతో వర్గ పోరులతో గొడవలు పడుతున్నారు. పలుమార్లు గొడవలు జరుగుతున్న పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారి, కస్తూర్బా జిల్లా అధికారిని అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఈ విషయంపై జిల్లా కస్తూర్బా అధికారిని నిర్మల వివరణ కోరగా పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలను అన్ని కస్తూర్బా పాఠశాలల మాదిరిగానే తనిఖీకి డీఈవో తో పాటు నేను మంగళవారం సాయంత్రం రావడం జరిగిందని, గొడవ జరిగినట్టు తన దృష్టికి రాలేదని, అలాంటి ఆరోపణలు తప్పని ఆమె పత్రిక విలేకరులకు పొంతన లేని సమాధానంతో చాలా సిల్లీ గొడవ అంటూ వివరణ ఇచ్చారు.

ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ కు చరవాణి ద్వారా వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

# ప్రజల భాగస్వామ్యంతోనే డ్రగ్స్ కట్టడి

**కేవలం చట్టపరమైన ఆంక్షలతోనే అడ్డుకట్ట సాధ్యం కాదు**

**మహేశ్వరంలో పీఐబీ ఆధ్వర్యంలో 'వార్త' మీడియా వర్క్‌షాప్**

**హాజరైన డీసీపీ నారాయణరెడ్డి, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్**

గండిపేట, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర)మాదకద్రవ్యాల మహమ్మారిని సమర్థంగా ఎదుర్కోవాలంటే కేవలం చట్టపరమైన ఆంక్షలు మాత్రమే సరిపోవని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమని మహేశ్వరం జోన్ డీసీపీ కె.నారాయణరెడ్డి స్పష్టం చేశారు. పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ–హైదరాబాద్) ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్‌ఎంబీఏ)'పై మహేశ్వరంలో మంగళవారం మీడియా ప్రతినిధులకు 'వార్త' అవగాహన సదస్సు నిర్వహించారు.౹ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నివారణ చర్యలు తొలుత ఇళ్లు, పాఠశాలల నుంచే ప్రారంభం కావాలన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సమాచారాన్ని పంచుకోవాలని సూచించారు. డ్రగ్స్ ముప్పును కేవలం శాంతిభద్రతల సమస్యగానే కాకుండా యువత భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి కోణంలోనూ చూడాలన్నారు. మాదకద్రవ్యాల సరఫరాను అడ్డుకునేందుకు ఎస్ఐడీ, ఆక్టోపస్, సీఐఎస్ఎల్, ఈగల్ ఫోర్స్‌లతో పాటు స్థానిక పోలీసు యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, పునరావాస సేవల సమాచారాన్ని చేరవేసేందుకు మీడియా చొరవ చూపాలని కోరారు.౹8 వేల కిలోల గంజాయి స్వాధీనం: ఈగల్ ఫోర్స్ ఎస్పీతెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసు సూపరింటెండెంట్ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం నేడు సమాజంతో పాటు జాతీయ భద్రతకూ సవాలుగా మారిందన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రంలో దాదాపు 8 వేల కేజీల గంజాయిని ఈగల్ ఫోర్స్ స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా సిబ్బందికి తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. డ్రగ్స్ కేసుల రిపోర్టింగ్‌లో మీడియా బాధ్యతాయుతంగా, సున్నితంగా వ్యవహరించాలని.. బాధితులు, మైనర్ల పేర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ బహిర్గతం చేయరాదని స్పష్టం చేశారు.పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. సరైన సమాచారంతో, బాధ్యతాయుత కథనాలు అందించేలా జర్నలిస్టులను ప్రోత్సహించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పాత్రికేయులు అడిగిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీడీవో ఎన్.శారదమ్మ, కార్యక్రమ సమన్వయకర్త, పీఐబీ మీడియా అధికారిణి వర్గంటి గాయత్రితో పాటు దాదాపు 60 మంది మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**మూసివున్న దుకాణాలే టార్గెట్.. 13 చోరీ కేసులు ఛేదింపు**

**రాజస్థాన్, గుజరాత్‌లో నలుగురు నిందితుల అరెస్ట్ జీడిమెట్ల పోలీసులు, సైబరాబాద్ ప్రత్యేక బృందాల సంయుక్త ఆపరేషన్**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర): రాత్రివేళల్లో మూసివున్న వాణిజ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. జీడిమెట్ల పోలీసులు, సైబరాబాద్ కమిషనరేట్ ప్రత్యేక బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముఠాకు చెందిన నలుగురు నిందితులను రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అరెస్ట్ చేశారు. వీరి అరెస్టుతో కుత్బుల్లాపూర్ జోన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో నమోదైన 13 చోరీ కేసులు ఛేదించినట్లు కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి తెలిపారు.

**చింతల్‌లో రూ.80 వేల చోరీతో మొదలైన దర్యాప్తు**

ఆగస్టు 5/6వ తేదీ అర్ధరాత్రి చింతల్ మెయిన్ రోడ్‌లోని గణేష్‌నగర్‌లో ఉన్న అయినాథ్ గ్లాస్ అండ్ ప్లైవుడ్ షాపులో చోరీ జరిగింది. దుకాణం షట్టర్‌ను పైకి లేపి లోపలికి ప్రవేశించిన దుండగులు కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.80 వేల నగదును అపహరించారు. దీనిపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితుల కదలికలను గుర్తించారు. చోరీ అనంతరం వారు రాజస్థాన్, గుజరాత్ వైపు పరారైనట్లు నిర్ధారించుకుని ప్రత్యేక బృందాలను అక్కడికి పంపించారు.

**రాజస్థాన్.. గుజరాత్‌లో వేట**

పోలీసుల ప్రత్యేక బృందాలు రాజస్థాన్‌లోని బేవార్ జిల్లాలో హరి సింగ్ (30), చందన్ సింగ్ (28)లను అదుపులోకి తీసుకోగా, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో లుంబ్ సింగ్ (29), మనోహర్ సింగ్ (20)లను పట్టుకున్నారు. సంబంధిత కోర్టుల నుంచి ట్రాన్సిట్ వారెంట్లు పొందిన అనంతరం నిందితులను హైదరాబాద్‌కు తీసుకువచ్చి తదుపరి దర్యాప్తు కొనసాగించారు.

**షట్టర్లు ఎత్తి.. నగదు, వస్తువుల చోరీ**

నిందితులు ఒకరికొకరు పరిచయం ఉండటంతో ముఠాగా ఏర్పడి రాత్రివేళల్లో మూసివున్న దుకాణాలను లక్ష్యంగా చేసుకునేవారని పోలీసులు తెలిపారు. ముందుగా పగటిపూట ఆయా ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, రాత్రివేళల్లో జనసంచారం తక్కువగా ఉండే దుకాణాలను ఎంచుకునేవారు. అనంతరం షట్టర్లను పైకి లేపడం లేదా పగులగొట్టి లోపలికి ప్రవేశించడం చేసేవారు. కొందరు దుకాణంలోకి వెళ్లి నగదు, విలువైన వస్తువులను అపహరిస్తుండగా.. మరికొందరు బయట కాపలాగా ఉండేవారు. చోరీ చేసిన నగదు, వస్తువులను విక్రయించి వచ్చిన మొత్తాన్ని పరస్పరం పంచుకునేవారని పోలీసులు వెల్లడించారు.

**క్యాష్ కౌంటర్లు.. హార్డ్‌వేర్ షాపులే లక్ష్యం**

గండిమైసమ్మ, చింతల్, జీడిమెట్ల, నిజాంపేట్, దూలపల్లి, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లోని క్యాష్ కౌంటర్లు, ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ దుకాణాలు, ప్లైవుడ్ షాపులు, కిరాణా, వస్త్ర దుకాణాలను ముఠా లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**13 కేసులు.. ఏ స్టేషన్‌లో ఎన్నంటే?**

దర్యాప్తులో నిందితుల ప్రమేయం మొత్తం 13 చోరీ కేసుల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాచుపల్లి పీఎస్ – 3 , దుండిగల్ పీఎస్ – 2, డిమెట్ల పీఎస్ – 2, పేట్ బషీరాబాద్ పీఎస్ – 3, మియాపూర్ పీఎస్ – 1, కేపీహెచ్‌బీ పీఎస్ 1 , మేడ్చల్ పీఎస్ 1 కేసులు ఉన్నట్లు గుర్తించారు.

**పోలీసు బృందాలకు డీసీపీ అభినందనలు**

ఈ కేసుల ఛేదనలో కూకట్‌పల్లి జజూ ఇన్‌స్పెక్టర్ జగదీష్, దుండిగల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్ నాయుడు, జీడిమెట్ల పోలీసులు, సైబరాబాద్ ప్రత్యేక బృందాలు కీలకంగా పనిచేశాయి. అంతర్రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ ఎన్. కోటి రెడ్డి అభినందించారు.

**దుకాణాల యజమానులు అప్రమత్తంగా ఉండాలి**

రాత్రివేళల్లో దుకాణాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసులు సూచించారు. దుకాణాల వద్ద స్పష్టమైన దృశ్యాలు రికార్డు అయ్యేలా జజుఎ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేస్తున్నాయో తనిఖీ చేసుకోవాలని తెలిపారు. షట్టర్లు, తాళాలు, ఇతర భద్రతా పరికరాలను పటిష్టం చేసుకోవడంతో పాటు దుకాణాల పరిసరాల్లో తగినంత వెలుతురు ఉండేలా చూడాలని సూచించారు. రాత్రివేళల్లో దుకాణాల్లో పెద్ద మొత్తంలో నగదు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మూసివున్న దుకాణాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ కోరారు.

## వన మహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను రక్షించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,(విజన్ ఆంధ్ర)భావితరాలకు సమతుల్య వాతావరణం అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను రక్షించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ఆవరణలో వనమహోత్సవం 2026 కార్యక్రమంలో భాగంగా ఎస్.పి. నితిక పంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణి లతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యాలు కావాలని తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చని, భవిష్యత్తు తరాల వారికి సహజమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, అటవీ శాఖ అధికారులు, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలను నాటండి..పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి

### వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



గద్వాల ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర బ్యూరో)మొక్కలను నాటడమే కాక పెరిగేలా సంరక్షిస్తేనే పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినట్లని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. అటవీ శాఖ, గద్వాల మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని 18వ వార్డు పరిధిలోని వెంచర్ లొని 10 శాతం స్థలంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్పీతోపాటు అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడేందుకు భావితరాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు. అడవులు పెరగడం వలన ఉష్ణోగ్రతలు తగ్గిపోవడమే కాక వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, సర్వే ఏడి నూకరాజు, అటవీ శాఖ అధికారి పర్విజ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఎన్జిసి జిల్లా సమన్వయకర్త శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది, ఎన్సిసి, స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### బీజేపీ ఆధ్వర్యంలో రెండు రోజుల నిరాహార దీక్ష

### దీక్షలో పాల్గొన్న జిల్లా యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్ర రెడ్డ

గద్వాల ఆగస్టు 25( విజన్ ఆంధ్ర బ్యూరో)మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షలో చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా రాష్ట్ర, జిల్లా, నాయకులతో కలిసి జోగులాంబ గద్వాల జిల్లా యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్ర రెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు. బిజెపి పార్టీ నాయకులు మాట్లాడుతూవిద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్య ఏదైన వారి పక్షాన బీజేపీ పోరాటం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ మర్రి బాపు రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఏక్బోటే ,గద్వాల పోటీ చేసిన శివారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ రెడ్డి ,బిజెపి సీనియర్ నాయకులు మిర్జాపురం వెంకటేస్వర రెడ్డి,దేవదాస్, దరూరు కిష్టన్న, నాగ మల్లయ్య, తుంకుంట అంజి తదితరులు పాల్గోన్నారు.



## వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల

కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 26(విజన్ ఆంధ్ర)పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, మొక్కల సంరక్షణపై ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తగూడెంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యానగర్ గ్రామపంచాయతీ వారి సహకారంతో ఎన్ఎస్ఎస్ జీజేసీ కొత్తగూడెం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. చుంచుపల్లి మండల ఎంపీడీవో సుభాషిని మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాలను కేవలం వనమహోత్సవానికే పరిమితం చేయకుండా నిరంతరం కొనసాగించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అది పెద్ద చెట్టుగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యానగర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మురళి మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో పచ్చదనాన్ని




పెంపొందించేందుకు ప్రజలు, యువత, విద్యార్థులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు కళాశాల స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విలేజ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొక్కల పెంపకం వల్ల వాతావరణ సమతుల్యత, స్వచ్ఛమైన గాలి, పచ్చదనం పెరుగుతాయని తెలిపారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కే. రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజం, పర్యావరణం పట్ల బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి విద్యార్థి తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణ బాధ్యతను చేపట్టాలని సూచించారు. ఫిజికల్ డైరెక్టర్ సముద్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. భవిష్యత్‌లోనూ కళాశాల పరిధిలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, పచ్చదనం పెంపు వంటి సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్వాహకులు తెలిపారు.

## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 26(విజన్ ఆంధ్ర) వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి మనుగడ సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి వన మహోత్సవ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఇల్లందు క్రాస్‌రోడ్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ఒక్కటే వన మహోత్సవం లక్ష్యం కాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి అది వృక్షంగా ఎదిగే వరకు బాధ్యతగా చూసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, పశువులు, ఇతర నష్టాల నుంచి రక్షణ కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద, పాఠశాల ఆవరణల్లో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని



సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తూ వృక్షంగా ఎదిగేలా చేస్తే పర్యావరణ పరిరక్షణలో ఎంతో కీలకమైన మార్పు తీసుకురాగలమన్నారు. ప్రస్తుత తరంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పచ్చదనం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. వన మహోత్సవ లక్ష్యాలను విజయవంతంగా సాధించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామ్ మాధవ్ రీ ఎంట్రీ ఫేట్ మారుస్తారా

హైదరాబాద్, ఆగస్టు 25దేశంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీలోకి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న రామ్ మాధవ్ ఎంట్రీ ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆయన స్కెచ్ వేసేందుకే కొత్త బాధ్యతలను రామ్ మాధవ్ కు అప్పగించినట్లు అర్థమవుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ కొత్త జాతీయ జట్టులో రామ్ మాధవ్ ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. దాదాపు ఆరేళ్ల తర్వాత పార్టీ ప్రధాన జట్టులోకి ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. రామ్ మాధవ్ ఆర్ఎస్ఎవ్ఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తి కావడం, ఇటీవల జెన్ జీ ఆందోళనలు, బీహార్ ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీలో ప్రవేశం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. జాతీయ రామ్‌మాధవ్‌కు మళ్లీ కీలక స్థానం దక్కడం, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న పలువురు నేతలు తమ పదవుల్లో కొనసాగడం ఈ జట్టు ప్రత్యేకత అని మరొకటిగా చెప్పుకోవాలి. రామ్‌మాధవ్ కు దేశంలోని అన్ని ప్రాంతాలపై లోతైన అవగాహన ఉంది. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో రామ్ మాధవ్ ను బీజేపీలోకి తీసుకోవడం ఆ పార్టీని బలోపేతం చేయడమే కాకుండా ఒకరకంగా రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలో విజయం సాధించడంతో పాటు వచ్చే లోక్ సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడం కూడా రామ్‌మాధవ్ పై బాధ్యతను పెట్టినట్లు సమాచారం. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ప్రారంభించిన రామ్‌మాధవ్ ఆర్ఎస్ఎస్ జాతీయ అధికార ప్రతినిధిగా, అఖిల భారత సహ ప్రచార ప్రముఖ్‌గా పనిచేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత పార్టీ సంస్థాగత వ్యవహారాల కోసం ఆర్ఎస్ఎస్ ఆయనను బీజేపీకి పంపింది. ఆ సమయంలో ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆ ఎన్నికల్లో బీజేపీని దేశంలో అధికారంలోకి తేవడంలో రామ్‌మాధవ్ కీలక భూమిక పోషించారు విషయ పరిజ్ఞానం... రామ్ మాధవ్ తూర్పుగోదావరి జిల్లా లో జన్మించారు. కాకినాడలో చదివారు. అమలాపురంలో ప్రాథమిక విద్యను మొత్తం పూర్తి చేశారు. తర్వాత కాకినాడలో పాలిటెక్నిక్ పూర్తి చేశారు. అనంతరం ఇంజినీరింగ్ ను కూడా పూర్తి చేశారు. అంతేకాదు పొలిటికల్ సైన్స్ లోనూ పట్టాను పొందారు. సమగ్రమైన అవగాహన ప్రతి అంశంపై ఉంది. జాతీయ, అంతర్జాతీయ విషయాలు, పరిణామాలపై అవగాహన ఎప్పటికప్పుడు ఏర్పరచుకుంటూ మంచి పట్టు సాధించారన్న పేరుంది. విషయ పరిజ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఆయన ఏ విషయంపైనా మాట్లాడతారు. గతంలో ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్‌లో బీజేపీ విస్తరణలో రామ్‌మాధవ్ కీలక పాత్ర పోషించారు. అసోం, త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ ప్రభుత్వాల ఏర్పాటు, పార్టీ బలోపేతంలో రామ్ మాధవ్ భాగస్వామ్యమయ్యారు. గత లోక్ సభ ఎన్నికల్లోనే బీజేపీకి సొంతంగా సీట్లు తగ్గాయి.

## చదువుతో పాటు నైపుణ్యం.. ఐటీఐలో చేరేందుకు మరో అవకాశం!

### ఆగస్టు 29 నుంచి వాక్ఇన్ అడ్మిషన్లు!

### సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తులకు అవకాశం

కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 26(విజన్ ఆంధ్ర)2026 ־27 విద్యా సంవత్సరానికి ఎ టి సి , ప్రభుత్వ ఐటీఐ, ఆర్ ఐ టి ఐ , మైనారిటీ ఐటీఐ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాలకు మూడో దశ వాక్ఇన్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రభుత్వ ఐటీఐ కొత్తగూడెం ప్రిన్సిపాల్ జి. రమేశ్ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు ఉఠ్.వశ్రీఖఅస్త్రుఖఉ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో రూ.100 ధ్రువీకరణ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, కేవలం ట్రేడ్, ఐటీఐలకు సంబంధించిన ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధిత ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10 గంటలకు హాజరై అటెండీ తీసుకోవాలని, మధ్యాహ్నం 1 గంట నుంచి మెరిట్, ఎంపిక చేసుకున్న ట్రేడ్, ఐటీఐ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని




వివరించారు. 10వ తరగతి లేదా కొన్ని నిర్దిష్ట ట్రేడ్‌లకు 8వ తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2022 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు అర్హులని, గరిష్ఠ వయోపరిమితి లేదని పేర్కొన్నారు. ఒకే ఆన్‌లైన్ దరఖాస్తులో అభ్యర్థులు తమకు నచ్చినన్ని ట్రేడ్‌లు, ఐటీఐలను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేసుకోవచ్చని, ఎక్కువ ఆప్షన్లు ఇవ్వడం ద్వారా సీటు పొందే అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి. రమేశ్ కోరారు.

## వనమహోత్సవంలో మొక్కలు నాటిన మేయర్, కమిషనర్

### ప్రతి ఇంటా ఒక మొక్క.. ప్రతి ఊరు పచ్చని వనం

### నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 26(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం ־2026లో భాగంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లోని రామచంద్ర పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, మున్సిపల్ కమిషనర్ సుజాత పాల్గొని మొక్కలు నాటారు. పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది సైతం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని



సూచించారు. "ప్రతి ఇంటా ఒక మొక్క.. ప్రతి ఊరు పచ్చని వనం" అనే లక్ష్యంతో ప్రజలు ముందుకు రావాలని మేయర్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ పరిధిలోని పార్కులు, ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా మున్సిపల్ కార్పొరేషన్ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వనమహోత్సవంలో భాగంగా నాటుతున్న మొక్కలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. "నేడు నాటిన మొక్కలే రేపటి తరాలకు జీవనాధారం" అని కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు. మొక్కల సంరక్షణలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే పట్టణాన్ని మరింత పచ్చగా మార్చవచ్చని అన్నారు. ఈ సందర్భంగా 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ మాట్లాడుతూ.. చెట్లు మానవాళికి స్వచ్ఛమైన గాలి, నీడతో పాటు పర్యావరణ సమతుల్యతను అందిస్తాయని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. "ప్రతి ఇంటా ఒక మొక్క. ప్రతి ఊరు పచ్చని వనం" అనే నినాదంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని సుప్రియ అన్నారు. ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. "మొక్కని నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి,

### విద్యార్థులు పుట్టిన రోజున మొక్క నాటి సంరక్షించాలి

### పీసీసీఎఫ్ వినయ్ కుమార్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 25, (విజన్ ఆంధ్ర):వన మహోత్సవంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ వినయ్ కుమార్, ఐఎఫ్ఎస్ అన్నారు. వన మహోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ వినయ్ కుమార్ మాట్లాడుతూ, వన మహోత్సవంలో భాగంగా సెప్టెంబర్ నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా లక్ష మొక్కలు నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో భాగంగా వీభీుదీజఔ=జుఖూ ప్రాంగణంలో 2,200



మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడం కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యతగా భావించకుండా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ప్రజలందరి భాగస్వామ్యంతో జిల్లాను మరింత పచ్చదనంతో నింపాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అలవాటును జీవితాంతం కొనసాగించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన మొక్కలను సంరక్షించడం అంతకంటే ముఖ్యమని ఆయన అన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటిని పట్టించుకోకుండా వదిలేయకుండా, వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ వినయ్ కుమార్, ఐఎఫ్ఎస్, చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా. ప్రియాంక వర్గీస్, ఐఎఫ్ఎస్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్ర రెడ్డి, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశీష్ సింగ్, ఐఎఫ్ఎస్‌లతో పాటు పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

# ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించిన -ఎస్సై గురు స్వామి



అయిజ ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలో ఎస్సై గురుస్వామి మంగళవారం ఆటో డ్రైవర్ల కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూఆటో డ్రైవర్లందరూ చెల్లుబాటులో ఉన్న ఆర్సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌లను తమ వెంట ఉంచుకుని, వాటిని సక్రమంగా ఉంచుకోవాలని, అలాగే నో పార్కింగ్, ప్రయాణీకుల భద్రత, మద్యం సేవించి వాహనం నడపడాన్ని నిషేధించడం వంటి ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనానికి అవసరమైన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవడం యొుక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. నిర్దేశించిన నియమాలు, నిబంధనలను ఉల్లంఘించిన, రాష్ డ్రైవింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమములో పోలీస్ సిబ్బంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి బంగారు ద్వాదశనామాలు బహుకరించిన డాక్టర్ ఆగ్యపోగు అశోక్ డాక్టర్ ప్రియాంక దంపతులు




మల్దకల్ ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఆది శిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి బిజ్వారం గ్రామానికి చెందిన డాక్టర్ ఆగ్యపోగు అశోక్ డాక్టర్ ప్రియాంక దంపతులు రూ. 1,54,000 విలువచేసే మూడు బంగారు ద్వాదశ నామాలను స్వామివారికి బహుకరించారు. మంగళవారం దేవాలయంలో వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అందజేయగా పూజలు నిర్వహించి అలంకరించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు స్వామి వారికి అలంకరించాలని భక్తులు కోరగా ప్రతినిత్యం స్వామి వారి అలంకారంలో ఉంచాలని అర్చకులను చైర్మన్ ఆదేశించారు. అనంతరం దాతలను స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

## ఉద్యోగుల తిరుగుబాటు తప్పదా

కాకినాడ, ఆగస్టు 25,ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నెల మూడో వారం వరకూ గడువు విధించారు. ఈలోపు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపకుంటే ఉద్యమ బాట పడతామని ఉద్యోగ సంఘాల నేతలు హెచ్చరించాయి. మూడో వారంలోపు చంద్రబాబు తమను పిలిచి చర్చించి సమస్యలను పరిష్కరించేలా హామీ ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల మూడు నెలలు కావస్తున్నప్పటికీ తమ సమస్యల పరిష్కారినికి చొరవ చూపలేదని అంటున్నారు. అందుకే తాము ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. పి.ఆర్.సి., డీఏ, హెల్త్ కార్డులపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమస్యలు, డిమాండ్ల విషయంలో ఏపీ జేఏసీ నాయకత్వం దృఢమైన వైఖరితో వ్యవహరించాలని నిర్ణయించింది. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ లపై సానుకూల నిర్ణయాలు కోరుతూ దశల వారీగా ఆందోళనలు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ జేఏసీ నేతలు కోరుతున్నారు. అయితే మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో ఇంకా కాలయాపన చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని కూడా ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాల పరిష్కారం సరెండర్ లీవ్, తదితర బకాయిల విడుదల ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ అఫ్ పెన్షన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఖ నుండి మినహాయింపు అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్?1లో చేర్చాలి. సీపీఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి ధరలు పెరగుతుండటంతో... పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్లిష్టంగా మారుతోందని, ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఉద్యోగ సంఘ నేతలు చెబుతున్నారు. సామాన్య ఉద్యోగి కష్టాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైతే తగిన పోరాట కార్యాచరణ చేపట్టేందుకు ఏపీ జేఏసీ సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు. నాయకులంతా సిద్ధంగా ఉండాలని కోరారు. ఆగస్టు చివరి వారంలో ఏపీ జేఏసీ విస్తృత రాష్ట్రస్థాయి సమావేశంలో ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకన్నట్లు తెలిపారు

# ప్రజల భద్రత విషయంలో రాజీ పడొద్దు

### హిట్ అండ్ రన్ కేసుల విషయంలో బాధితులకు పరిహారం అందించాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రాలి




కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో)25 ఆగస్ట్. ప్రజల భద్రత విషయంలో రాజీ పడొద్దని. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్ పర్సన్ గా లికలెక్టర్‌లి మాట్లాడారు. అధికారులు ప్రధాన రహదారులను తరచుగా తనిఖీలు చేస్తూ.. ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీసీ ప్యాచ్ వర్క్ లు, మేజర్ అప్రోచ్ రోడ్డు పనులు, రద్దీ ప్రాంతాల్లో ఓపెన్ డ్రైనేజీ తదితర సమస్యల గురించి చర్చించారు. ఆర్ఓబి వంతెన వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. ార్పొరేషన్ పరిధిలో సర్కిల్ వారీగా తనిఖీలు చేస్తూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ సైడ్ ఫ్లెక్సీలు హోల్డింగ్ల విషయమై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి.. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి బాధితులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రానున్న గణేష్ ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీపీ లిగౌస్ అలంలి మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాలు, ఈ చలాన్లు, హిట్ అండ్ రన్ కేసుల విషయాలు వివరించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు, పోలీస్, వైద్య, మున్సిపల్, అగ్నిమాపక శాఖ, ఆర్అండ్ బీ, ఎన్ హెచ్ఏఐతో పాటు వివిధశాఖల అధికారులు, ఆర్టీఏ మెంబెర్ పడాల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న గుండవెల్లి ప్రాథమిక పాఠశాల తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి25 ఆగస్టు (విజన్ ఆంధ్ర)సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్నం, వంకాయ ఆలుగడ్డ కూర, పప్పు చారును తనికి చేశారు. కూరల నాణ్యత చాలా బాగుందనిఅభినందించారు. పిల్లలు చాలా ముద్దుగా ఉన్నారని, వారితో ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా పిల్లకు పళ్ళెంలో అన్నం, కూరలు వడ్డించారు. అన్నం కూర కలుపుకుని శుభ్రంగా తినాలని, పిల్లలు తినేటప్పుడు సహాయం చెయ్యాలనిఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల వాతావరణం చాలా బాగుందని, ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని ఇలాగే పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రిన్సిపల్ ను అభినందించారు. ప్లే స్కూల్ బాగంగా గదిలో విద్యార్థులుఆడుకోడానికి, కూర్చోడానికి వివిధ సామాగ్రిని పరిశీలించారు. పిల్లలకు రంగురంగుల వస్తువులు, ఆట వస్తువులతో ఆడుకోవడం చాలాఇష్టంఅనిసంతోషంగాఆడుకుంటారని, పడిపోకుండా గొడవ పడకుండా మానిటర్ చెయ్యాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు.

# పోలీసు ఉద్యోగాల కోసం ఉచిత కోచింగ్

### 7,437 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్.. యువత సద్వినియోగం చేసుకోవాలి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్




కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 26(విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలోని సివిల్, ఏఆర్, టీజీఎస్పీతో పాటు ఎస్పీఎఫ్, జైళ్ల శాఖ, ఫైర్ విభాగాల్లో సుమారు 7,437 ఖాళీల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ నిరుద్యోగ యువతకు శుభవార్త అందించింది. పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ తెలిపారు. పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలకు చెందిన యువతీ యువకులకు పోలీసు ఉద్యోగాల సాధనలో అండగా నిలిచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో రాత పరీక్షకు శిక్షణ, పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఉచిత ఫిజికల్ ట్రైనింగ్ అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తామన్నారు. కోచింగ్‌కు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతలకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను సమర్పించాలన్నారు. మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అర్హులైన, ప్రతిభావంతులను ఎంపిక చేసేందుకు సెప్టెంబర్ 6న కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, భద్రాచలం, మణుగూరు పట్టణాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన వారికి కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణ కేంద్రం తదితర వివరాలను మీడియా ద్వారా వెల్లడిస్తామన్నారు. పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న యువత క్రమశిక్షణతో కష్టపడి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. మరిన్ని వివరాల కోసం ఎస్బీ ఎల్ఎల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను 8712682013 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## వన మహోత్సవంలో కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో)25 ఆగస్ట్. వన మహోత్సవంలో భాగంగా కరీంనగర్ ముకరాంపుర ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు రామచందర్‌రావు, సృజన్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమిలో ఎవరి బలం ఎంత

విజయవాడ, ఆగస్టు 25,ఆంధ్రప్రదేశ్ లో కూటమిలో ఏ పార్టీ బలంగా ఉన్నాయంటే అన్నీ వేళ్లూ టీడీపీ వైపు చూపుతాయి. టీడీపీకి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. క్షేత్ర స్థాయిలో బలం ఉంది. తెలుగుదేశం పార్టీకి ఒకే ఒక మైనస్ సొంతంగా పోటీ చేసి ఎప్పుడూ గెలవకపోవడమే. అదే పొత్తులతో ఇప్పటి వరకూ చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కానీ సీట్ల పంపకాల విషయంలో మాత్రం ఖచ్చితంగా టీడీపీదే పై చేయిగా ఉంటుంది. ఎందుకంటే బలం, బలగం అధికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ రాజీ పడే అవకాశముండదు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించే అవకాశం లేదు. ఎన్నాళ్ల నుంచో కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న ధోరణిలో ఉన్నారు. అందులోనూ టీడీపీకి అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వం ఉంది. ఓడిపోయినా.. గెలిచి సత్తా చూపించిన చరిత్ర ఆ పార్టీది. అలాగే ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎప్పుడూ టీడీపీ రాష్ట్రంలో ఏ స్థానాల్లోనైనా రాజీ పడలేదు. ఎమ్మెల్సీ స్థానాలను కూడా తమ సంఖ్యకు అనుగుణంగా సాధించుకుంది. గత ఎన్నికల్లో 130కి పైగా స్థానాలను సాధించిన ఆ పార్టీకి ఎక్కువ స్థానాలను ఆశించడంలో తప్పులేదు. అలాగే కూటమిలోని విపక్షాలు అత్యాశకు పోవడం కూడా మంచిది కాదు. ఎందుకంటే.. స్థానిక సంస్థల ఎన్నికలు క్యాడర్ తో పాటు పార్టీని బలోపేతం చేసేవి కావడంతో ఖచ్చితంగా ఈ ఎన్నికలను సైకిల్ పార్టీ సవాల్ గా తీసుకుంటుంది. గత వైసీపీ పాలనలో పోటీ చేసి ఒక్క స్థానంలో గెలవలేదన్న కసి టీడీపీ నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ కనిపిస్తుంది. ఆ అవకాశాన్ని ఇప్పుడు వదులుకోలేరు. చంద్రబాబు కూడా అందుకు అంగీకరించే అవకాశాలుండవు. బలమైన పార్టీ కావడంతో... ఏ పక్షమైనా తమ బలాన్ని బట్టి ముందుకు వెళితే ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయవచ్చు. 175 నియోజకవర్గాల్లో బలంగా ఉన్న టీడీపీకి, మిగిలిన రెండు పార్టీలకు చాలా వ్యత్యాసం ఉంది. అవి కేవలం కొన్ని నియోజకవర్గాలు, కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అందుకే ఇచ్చింది తీసుకోవడం మినహా మరో దారి కూటమిలోని మిగిలిన పార్టీలకు ఉండదు. అలాగని కూటమి నుంచి విడిపోతే రాజకీయ నష్టం కేవలం టీడీపీకే మాత్రం జరగదు. మిగిలిన జనసేన, బీజేపీలకు కూడా జరుగుతుంది.

# పచ్చదనాన్ని కాపాడటం ద్వారా సమతుల్య వాతావరణం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,(విజన్ ఆంధ్ర)మొక్కలు నాటి సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమతుల్య వాతావరణాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం బొక్కలగుట్ట ప్రాంతంలోని గాంధారి వనంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు సహజమైన సమతుల్య వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. చెట్ల ద్వారా మనకు కావలసిన సహజవాయువు, ఆరోగ్యకరమైన ఆహారం, ఆశ్రయం లభిస్తాయని, వర్షాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం రోజున 4 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, జిల్లాకు నిర్దేశించిన 41 లక్షల మొక్కల లక్ష్యాన్ని దాదాపు 80 శాతం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించాలని, సమతుల్య వాతావరణ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని ఆర్.కె. గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన రెండు పడక గదుల ఇండ్ల లబ్దిదారుల లక్కీ డ్రా కార్యక్రమానికి డి.సి.పి., మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, మండల తహసిల్దార్ సతీష్ కుమార్, ఇందిరమ్మ ఇండ్లు పి.డి. బన్సీలాల్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు రెండు పడక గదుల ఇండ్ల పథకంలో ఇండ్లు కేటాయించడం జరుగుతుందని, ఈ క్రమంలో పారదర్శకమైన కేటాయింపు కొరకు అర్హులైన లబ్ధిదారులకు లక్కీడ్రా నిర్వహించి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పథకం చేపట్టి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా లక్కీడ్రా పద్ధతిన పారదర్శకంగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రాలను దానం చేసే వారిని ప్రోత్సయించాలి



సూర్యాపేట ఆగస్టు 25:(విజన్ ఆంధ్ర)నేత్రాలను దానం చేసే వారిని ప్రోత్సయించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ నందు 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన మరియు ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్రదానం ఒక మహత్తరమైన సామాజిక సేవ అని, ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసే నేత్రాలు ఇద్దరు అంధులకు వెలుగును ప్రసాదించే అవకాశం ఉందని తెలిపారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పుట్టిన శిశువు నుండి అన్నీ వయస్సుల వారికి నేత్ర రుగ్మతలను గుర్తించి, తగిన చికిత్స అందించి వారికి మంచి చూపుతో ఆరోగ్య కరమైన జీవితం అందించాలని, ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, తమ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. స్కూల్స్ , కాలేజీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించాలని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల నిర్వహణ కొరకు 90 రోజులలో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తేవాలని, మెడికల్ కళాశాలలో లైబ్రరీ నిర్వహణకు సంబంధించి 30 లక్షల లోగడ విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యం కలిగిన మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భముగా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యక్రమాలను సమర్ధవంతముగా అమలు పరుచుటకు రూ .50,000 మంజూరు చేశారు. మీ కళ్లను మరణానంతరం మట్టిలో కలపకుండా, మరొకరి జీవితంలో వెలుగుగా మార్చండి నేత్రదానం చేయండని ప్రజలకు పిలుపునిచ్చారు. నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు మరియు ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా,, పెండెం వెంకట రమణ తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని “నేత్రదానం చేయండి.. మరొకరికి చూపును ప్రసాదించండి” అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా, శ్రవణ్ కుమార్, కంటి వైదులు డా,, యస్ రమేశ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకట రమణ, ప్రోగ్రాం అధికారి డా, జి చంద్రశేఖర్, డా, నాజియా తబస్సుం, డా, శ్రీశైలం, డా, వాసవి, వైద్య ,ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## అదనపు కలెక్టర్ హరి సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత..

సూర్యాపేట ఆగస్టు 25:(విజన్ ఆంధ్ర)పర్యావరణ పరిరక్షణతో పాటు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పిలుపునిచ్చారు. పట్టణంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హరి సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవ కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి పట్టణం, ప్రతి గ్రామంలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను



కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకాన్ని నిరంతర కార్యక్రమంగా కొనసాగించాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ మొక్కలు నాటడం మాత్రమే కాకుండా అవి పెరిగే వరకు సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో పచ్చదనం పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు. పట్టణంలో ఎక్కువ సంఖ్యలో చెట్లు పెంచితే వాతావరణంలో సమతుల్యత ఏర్పడి ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ప్రతి చుక్కను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమాన్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీవుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు నాగుల వాసు, గండూరి రమేష్, కొణతం రాజేష్ రెడ్డి, ఈఈ కిరణ్,డీఈ ప్రణయ్ రెడ్డి,మేనేజర్ బుచ్చిబాబు ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ యాదగిరి,జూనియర్ అసిస్టెంట్లు అజిముద్దిన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, వన మహోత్సవం ఇంచార్జ్ లు వసుంధర,వసీం తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కొరకు దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,(విజన్ ఆంధ్ర)జిల్లాలో అర్హత కలిగిన గిరిజన విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ గురుకుల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు తదితర పాఠశాలలలో చదువుతున్న అర్హత కలిగిన ఎస్.టి. విద్యార్థులు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పోర్టల్ ష్ట్రజూం:7/వశ్రీఖఅస్త్రుఖఙువజుఝ౦౦.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థి ఫోన్ నంబర్, ఆధార్, బ్యాంకు ఖాతా, కులం, ఆదాయం, విద్యా వివరాలను సరిచూసుకుని నమోదు చేయాలని, విద్యార్థి బ్యాంకు ఖాతా క్రియాశీలంగా ఉండేలా చూసుకోవాలని, అవసరమైన పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు/సంబంధిత అధికారులకు సమర్పించాలని, దరఖాస్తు ప్రక్రియలో ఏవైనా సందేహాలు, సమస్యలు ఉంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు / గిరిజన సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# భూ సేకరణ పనులు వేగవంతం చేయాలి

## రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,(విజన్ ఆంధ్ర)రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, పునరావాసం, కాలువల నిర్మాణం, అటవీశాఖ అనుమతుల పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని జల సౌధా కార్యాలయం నుండి నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, పునరావాస కమిషనర్ శివకుమార్, నీటిపారుదల శాఖ ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, భూ సేకరణ, నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, పునరావాసం, పునరావాస పునరుద్ధరణ, అటవీ అనుమతులు, భూ యజమానులకు పరిహారం చెల్లింపు కార్యక్రమాలు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేస్తుందని, ఇందుకు గాను ఈ సంవత్సరంలో 6 వేలకోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని, కలెక్టర్ల వద్ద పి.డి. ఖాతాలో ఉన్న నిధులను వెంటనే భూ యజమానులకు చెల్లింపులు చేయాలని తెలిపారు. అవార్డు పాసులు, పరిపాలన అనుమతులు, క్షేత్రస్థాయి పరిశీలన త్వరగా చేపట్టాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో భాగంగా సేకరించిన భూముల యజమానులకు నష్టపరిహారం, ఇండ్లు, భూములు కోల్పోయిన వారికి పునరావతం కల్పించడం, భూసేకరణలో భాగంగా అటవీ భూములు సేకరించినట్లయితే అటవీ శాఖ అనుమతులు పనుల వేగవంతానకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, భూసేకరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

## ఆర్అండ్ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

## కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుమోహన్

గద్వాల ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర బ్యూరో)సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సంబంధిత సమస్యలపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున పనులను పెండింగ్ లో ఉంచకుండా వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టుల వారీగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నిర్దేశిత సమయంలోగా పరిహారం చెల్లించాలని ఆదేశించారు. అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తై నిధులు అందుబాటులో ఉన్న చోట వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించిన అటవీ




సమస్యలు, పెండింగ్ చెల్లింపులు, క్లియరెన్సులు, ఇతర అడ్డంకులను గుర్తించి ఇరిగేషన్ శాఖకు వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలు, ఆర్థిక అనుమతులు, టోకెన్లు, ఇతర ఆర్థిక, ప్రక్రియాపరమైన కారణాలతో ఏ సాగునీటి ప్రాజెక్టు ఆలస్యమవుతున్నా సంబంధిత కలెక్టర్, చీఫ్ ఇంజినీర్ సమస్యను స్పష్టంగా గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా లోని ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ మధుమోహన్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్ని మాట్లాడుతూ. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. అనంతరం ఆయన జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, జీ సెక్షన్ పర్యవేక్షకులు మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల బాలికల లో వనమాహోత్సవం కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటిన డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25. (విజన్ ఆంధ్ర)ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాల బాలికల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే మొక్కల ప్రాధాన్యతను తెలుసుకొని వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో నాటిన ప్రతి మొక్కను విద్యార్థులు దత్తత తీసుకుని క్రమం తప్పకుండా నీరు పోస్తూ సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెద్దవిగా పెంచినప్పుడే కార్యక్రమం సార్థకమవుతుందని ఆయన పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,పవార్. లింబారావ్, కూడ్మే త జంగు, బండ మీనారెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని పాఠశాల ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని డిప్యూటీ డైరెక్టర్ సూచించారు.

# ఖరీఫ్, రబీ సీఎంఆర్ డెలివరీలను సకాలంలో పూర్తి చేయాలి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 25, (విజన్ ఆంధ్ర): ఖరీఫ్ రబీ సీఎంఆర్ డెలివరీలను సకాలంలో పూర్తి చేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కస్టమ్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి, ఖరీఫ్, రబీ 2025 "26 సంవత్సరాలకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ సి ఎం ఆర్ డెలివరీల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్, రబీ 202526కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ డెలివరీలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ముఖ్యంగా రా సీఎంఆర్‌ను భారత ఆహార సంస్థ ఎఫ్ సీ ఐ కు డెలివరీ చేయడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. మిల్లర్లు తమ వద్ద ఉన్న పెండింగ్ సీఎంఆర్‌ను వెంటనే డెలివరీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సీఎంఆర్ డెలివరీలలో జాప్యం లేకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డి సి ఎస్ ఓ వనజాత, డి యం సి ఎస్ హరీష్, సంబంధిత శాఖల అధికారులు, కస్టమ్ మిల్లర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మహమ్మద్ అంజద్ పాషా నియామకం



జనగామ, ఆగస్ట్25(విజన్ ఆంధ్ర): జనగాం పట్టణం ధర్మకంచకు చెందిన మహమ్మద్ అంజద్ పాషా ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు సల్మాన్ ఉద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా అంజద్ పాషా మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నా ఈ నియమకం సహకరించిన రాష్ట్ర మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర నాయకులకి, జిల్లా అధ్యక్షులు, జిల్లా నాయకులకు మరియు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను ఇచ్చినందుకు, పార్టీ బలోపేతం చేస్తానని అన్నారు.

# వనమహోత్సవం ఒక సామాజిక బాధ్యత: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

## జర్నలిస్టులు, పిల్లలు, అధికారులతో కలిసి మొక్క నాటిన జిల్లా కలెక్టర్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 ( విజన్ ఆంధ్ర):ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం లిజిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌లి అటవీశాఖ అధికారి బి.లావణ్య తో కలిసి ఈదులపూసపల్లి లేక్ వ్యూ నేచర్ పార్క్, చెరువు ప్రాంతంలో కలిసి మొక్క నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి విస్తృతంగా మొక్కలు నాటడమే ఏకైక మార్గమని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు ప్రతి శాఖకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా, వాటికి ట్రీ-గార్డులు ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా నీరు పోసి కాపాడే బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు,




రహదారుల ఇరువైపులా నాటిన మొక్కల ఎదుగుదలను ఎప్పటికప్పుడు జియో-ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ప్రాంగణంలో లేదా పరిసరాల్లో కనీసం ఒక మొక్క నాటి, దానిని దత్తత తీసుకున్నట్లుగా సంరక్షించాలని ప్రజలను కోరారు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు వంటి శుభకార్యాల సందర్భంగా జ్ఞాపకంగా మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. అడవుల విస్తీర్ణాన్ని పెంచడం, పచ్చదనాన్ని కాపాడుకోవడం మనందరి ప్రాథమిక కర్తవ్యమని గ్రహించి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. జిల్లా లక్ష్యం 43. లక్షల 51 వేలు వివిధ విభాగాలకు చెందిన వారి వారి లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు, అనంతరం నందనవనం పార్క్ ను సందర్శించి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఫారెస్ట్ అధికారులకు సూచి,ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ డివిజనల్ అధికారి ఏ. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్, ఎఫ్ ఆర్ ఓ సురేష్, మహబూబాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ జ్యోతి, మహబూబాబాద్ తాహసిల్దార్ రాజేశ్వర్, స్థానిక కౌన్సిలర్, మీడియా ప్రతినిధులు, పాటశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

## నేత్రదానం దానం చేయండి అందుల జీవితాలలో వెలుగులు చూడండి

## జిల్లా అంధత్వ నివారణాధికారి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

గద్వాల ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలో 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు 25-08-2026 నుండి 08-09-2026 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా అంధత్వ నివారణాధికారి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.సంధ్య కిరణ్మై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగ ప్రజల్లో నేత్రదానంపై అవగాహన కల్పించడం, నేత్రదానం ప్రాముఖ్యతను వివరించడం, మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వార చూపులేని వారికి వెలుగును అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. నేత్రదానం మహాదానం అని, ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా చూపులేని వారికి కంటి చూపును అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, స్వచ్ఛందంగ నేత్రదానం చేయుడానికి ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని, ఇంద్రియాలలో కళ్ళు అత్యంత ప్రధానమైనవని పేర్కొంటు, మీ



కళ్ళకు దీర్ఘాయుష్షునివ్వండి.. నేత్రదానం చేయండి... చూడలేని వారికి కంటి చూపునివ్వండి... అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగ తీసుకెళ్లాలని కోరారు. నేత్రదానం చేయాలనుకున్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, ఆరోగ్యశాఖ సిబ్బందిని లేదా సరోజినీ దేవి కంటి ఆసుపత్రి మెహదీపట్నం ఫోన్ నెంబర్ 040-23317274, 23340417 గల నెంబర్లకి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్. ప్రసూన రాణి, డా.రాజు, డా.అజ్గర్ అలీ, డా.రామచంద్ర రావు, ప్రవీణ్ కుమార్, నేత్ర వైద్యాధికారి, ఎస్ఓ. తిరుమల్ రెడ్డి, డిపిఎచ్ఎన్ఓ.వరలక్ష్మి, ఇన్చార్జి డెమో హిర్యనాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న జగన్

విజయవాడ, ఆగస్టు 25,వైసీపీ అధినేత వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండి పెద్ద తప్పు చేస్తున్నారు. వచ్చిన అంది వచ్చిన అవకాశాన్ని కూడా మిస్ చేసుకుంటు న్నారు. బయట మీడియా సమావేశాలు పెట్టినంత మాత్రాన ఒరిగేదేంటి? అదే అసెంబ్లీలో రెండు నిమిషాలు మాట్లాడి వాకౌట్ చేసి బయటకు వస్తే ఎంతో కొంత రాజకీయ ప్రయోజనం లభించవచ్చు. అదే సమయంలో జగన్ ను వ్యక్తిగతంగా ఎవరైనా అధికార పార్టీ సభ్యులు దూషిస్తే ఆ సాకు చూపించి బహిష్కరించవచ్చు. సమయం ఇవ్వరంటూ ముందుగానే తనకు తానే నిర్ణయించుకుని అసెంబ్లి సమావేశాలను పూర్తిగా బహిష్కరించం కూడకా సక్రమం కాదు. గెలిచి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన జగన్ కుంటిసాకులు చెబుతు తప్పించుకుంటున్నారన్న విమర్శలకు ఆయన సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంది. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తామని కండిషన్ పెట్టడం కూడా ఎవరూ హర్షించరు. శాసనసభ నియమ నిబంధనల మేరకే ప్రతిపక్ష హోదా ఇస్తారు. దీంతోపాటు తనకు సమయం ఇవ్వరని ముందునుంచే జగన్ వాదించి సభకు దూరంగా ఉండటం కూడా సరికాదు. అసెంబ్లీకి తనతో పాటు పది మంది ఎమ్మెల్యేలతో వస్తే సమయం ఇచ్చేది లేనిదీ తెలిసేది. సభకు హాజరై అప్పుడు సమయం ఇవ్వకుంటే నేరుగా అప్పుడే తనకు సభలో మాట్లాడేందుకు సమయం ఇవ్వకపోవడం వల్లనే సభకు రాలేకపోతున్నానని చెప్పుకునే వీలుంటుంది. అంతే తప్ప అసలు సభలో అడుగు పెట్టకుండానే, తనకు సమయం ఇవ్వరని జగన్ చెప్పడాన్ని కూడా ఎవరూ స్వాగతించారు. తాము 2024 ఎన్నికల్లో గెలిచి సభకు వెళ్లలేకపోతున్నామన్న బాధ వైసీపీ ఎమ్మెల్యేల్లోనూ కనపడుతుంది. చంద్రబాబు తాను సభకు హాజరు కాకపోయినా... పోనీ తాను సభకు హాజరు కాకపోతే పోనీ. మిగిలిన పది మంది ఎమ్మెల్యేలన పంపి అసెంబ్లీలో కొంత వాదన చేసి బయటకు వచ్చే వీలుంది. ఆ అవకాశాన్ని కూడా జగన్ చేజేతలా వదులుకుంటున్నారు. తనతో పాటు తన పార్టీ ఎమ్మెల్యేలు కూడా సభకు వెళ్లకూడదని గిరి గీయడం అంటే శాసించడమేనన్న వాదనకు మరింత బలం చేకూరుతుంది. జగన్ శాసనసభకు గైర్హాజరు అతి పెద్ద తప్పిదమని (బ్లండర్ మిస్టేక్) అధికార కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తప్పులను వివరించలేక జగన్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ అంశాలపై సభలో సమాధానం చెప్పకుండా పారిపోతున్నారని అధికార పక్షం విమర్శిస్తోంది. ప్రజల తరఫున నిలదీయాల్సిన అసెంబ్లీ వేదికను వైఎస్సార్సీపీ బహిష్కరించడం రాజకీయంగా నష్టదాయకమని విశ్లేషకులు భావిస్తున్నారు. అసెంబ్లీకి వైఎస్ జగన్ ఎందుకు దూరంగా ఉంటున్నారనే ప్రశ్నకు బహుశా ఆయన వద్దనే సమాధానం ఉండి ఉండకపోవచ్చు.

# దరఖాస్తుల పరిశీలనలో మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,(విజన్ ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, గృహ నిర్మాణ శాఖ పి.డి. లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల అభివృద్ధి అధికారులతో చేయూత పింఛన్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిశీలనలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, అర్హత ఉన్న ఒక్క లబ్ధిదారుడు నష్టపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామస్థాయిలో దరఖాస్తుల పరిశీలన సందర్భంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఎం. రామకృష్ణ,, ఎ.పి.ఎం. రాజ్, 15 మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# బి.పి. మండల్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన బీసీ సంఘం నాయకులు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25. (విజన్ ఆంధ్ర) బీసీ రిజర్వేషన్ల పితామహుడు, సామాజిక న్యాయ సాధన కోసం జీవితాంతం కృషి చేసిన బి.పి. మండల్ జయంతి సందర్భంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో . బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రూపునార్ రమేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రూపునార్ రమేష్,మాట్లాడుతూ బి.పి. మండల్ చేసిన సేవలు భారతదేశ సామాజిక న్యాయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. దేశంలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను అధ్యయనం చేసి, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలను సూచించేందుకు ఏర్పాటైన మండల్ కమిషన్ ద్వారా బీసీల సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి బి.పి. మండల్ అని పేర్కొన్నారు. మండల్ కమిషన్ దేశవ్యాప్తంగా వెనుకబడిన తరగతుల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి, వారి అభ్యున్నతికి అనేక కీలక సిఫార్సులు చేసిందన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చేసిన సిఫార్సు దేశంలో సామాజిక న్యాయానికి ఒక కీలక మైలురాయిగా నిలిచిందని తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం, సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని మండల్ కమిషన్ బలంగా ముందుకు తీసుకువచ్చిందన్నారు. బి.బీసీ యువత బి.పి. మండల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, బీసీ సంక్షేమ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు మామిడి కిరణ్, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడుబొట్టుపల్లి ప్రశాంత్, ఆసిఫాబాద్ బీసీ సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ అసద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చూనార్కర్ వసంతరావు , ఇగరపు సంతోష్, ఎతీం నాయకులు మాటూరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,( విజన్ ఆంధ్ర)రాష్ట్రంలో పర్యాటక ప్రదేశాలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి వాతావరణ పరిస్థితులు, వర్షపాతం నమోదు, వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు, నీట్ పి.జి. 2026 పరీక్షల నిర్వహణ, పర్యాటక రంగ అభివృద్ధిపై వ్యవసాయ, పర్యాటక, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో చాలా జిల్లాలను లోటు వర్షపాతం నమోదైనందున వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగు వైపు రైతులను సిద్ధం చేయాలని తెలిపారు. పెసర, కంది, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగుకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్రంలో నీట్ పి.జి. 2026 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతులు, బందోబస్తు ఏర్పాటు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం ఖరీఫ్ సీజన్ లో 11 వేల ఎకరాల వరి సాగు తగ్గిందని, ప్రత్యామ్నాయ పంటలు జొన్న, పెసర, కంది, కూరగాయల సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పిస్తూ తగు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో పర్యాటక ప్రదేశాలను గుర్తించి వాటి అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, పర్యాటక అధికారి అశ్వక్ అహ్మద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శివారు ప్రాంతాలు, మున్సిపాలిటీ విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సూర్యాపేట ఆగస్టు 25:(విజన్ ఆంధ్ర)శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి దశలవారీగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 14వ వార్డులోని స్నేహ నగర్ కాలనీలో పర్యటించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హనుమంత రెడ్డి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షం నీరు ఖాళీ స్థలాలలో నిల్చుడటం వలన దోమలు వస్తుండటంతో, పిల్లలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మెయిన్ సమస్యను కు పరిష్కరిస్తానని, తాత్కాలికంగా నీటి నిలువ ఉండకుండా ఇరిగేషన్ వారితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని తెలిపారు. ఖాళీ స్థలం యజమానులకు సమాచారం ఇచ్చి నీళ్లు నిలువ ఉ ఒడకుండా శుభ్రం చేసుకోవాలి తెలిపారు. స్నేహ నగర్ కాలనీ వాసుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ గాలి సాయి, 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పంతంగి దశరథ, కౌన్సిలర్లు నాగుల వాసు,సునీల్ రెడ్డి,ఈఈ కిరణ్, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ యాదగిరి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ రహీం, కరుణాకర్ రెడ్డి, వీరన్న నాయక్,లక్షాది తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## మానవ జీవన విధానానికి మొక్కలే కీలకం

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ



సూర్యాపేట ఆగస్టు 25:(విజన్ ఆంధ్ర)పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం మోతే మండలం లోని రాంపురం తండాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో కలెక్టర్, ఎస్పీ పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలను పెంచడం వలన అవి మన భావితరాలకు కావలసిన ఫలాలను అందిస్తాయని అన్నారు. అనంతరం మామిళ్లగూడెం హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల గురించి, పిల్లల భోజనం, పిల్లలు హాజరు శాతం గురించి కలెక్టర్ హెడ్మాస్టర్ ని అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లోరాంపురం సర్పంచ్ బానోతు సత్తెమ్మ,మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్ రెడ్డి, తాసిల్దార్ వెంకన్న, ఎంపీడీవో సందీప్ కుమార్, హెడ్మాస్టర్ నళిని, ఎంపీఓ వంశీకృష్ణ, జర్నలిస్టులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యంతో వాహనం నడపాలి బాధ్యతతో విధులు నిర్వహించాలి

## పోలీస్ డ్రైవర్లకు భద్రత,నైపుణ్యం, సేవా బాధ్యతపై ప్రత్యేక శిక్షణ

## రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 25,(విజన్ ఆంధ్ర)రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ వాహనాలను నడిపే డ్రైవర్లు మరింత నైపుణ్యం, అప్రమత్తత, బాధ్యతతో విధులు నిర్వహించాలనే ఉద్దేశంతో, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు "నైపుణ్యంతో వాహనం నడపాలి... బాధ్యతతో విధులు నిర్వహించాలి" అనే నినాదంతో పోలీస్ డ్రైవర్లకు భద్రత, నైపుణ్యం,సేవా బాధ్యతపై ఒకరోజు ప్రత్యేక పునశ్చరణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై పోలీస్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,పోలీస్ డ్రైవర్లు ఎల్లప్పుడూ శారీరక దృఢత్వం, అప్రమత్తత, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. డ్రైవర్‌పై అధికారులు, సిబ్బంది, ప్రజల భద్రత ఆధారపడి ఉంటుందని, అందువల్ల ఒత్తిడి, భయం,కోపం లేదా అనారోగ్య పరిస్థితుల్లో వాహనం నడపకూడదని స్పష్టం చేశారు. పోలీస్ వాహనాన్ని సొంత వాహనంలా భావించి,దాని పరిశుభ్రత,నిర్వహణ, సాంకేతిక స్థితిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వాహనం శుభ్రంగా, క్రమబద్ధంగా ఉండటం డ్రైవర్ క్రమశిక్షణకు ప్రతిబింబమని తెలిపారు. అదేవిధంగా విధి నిర్వహణలో మాటపై నియంత్రణ, గోప్యత,సత్ప్రవర్తన పాటించాలని, వాహనంలో జరిగే అధికారిక విషయాలను బయటకు వెల్లడించకూడదని సూచించారు. పోలీస్ వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ వేగాన్ని నియంత్రించి, అప్రమత్తంగా వాహనాలు నడపాలని తెలిపారు. వాహనాల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతోపాటు, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించేలా డ్రైవర్లకు ఈ శిక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ విధుల్లో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు, అత్యవసర సమయాల్లో వేగంగా, సమర్థవంతంగా స్పందించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉంటుందని అన్నారు. ప్రతి ప్రయాణంలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నైపుణ్యంతో, అప్రమత్తతతో,పూర్తి బాధ్యతతో వాహనాలు నడపాలని పోలీస్ కమిషనర్ డ్రైవర్లకు సూచించారు. డ్రైవర్ల సంక్షేమం, వైద్య సదుపాయాలు, ఇతర అవసరాలను తీర్చేందుకు శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. మంచి డ్రైవింగ్, క్రమశిక్షణతో పోలీస్ శాఖకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. వీఐపీ కాన్వాయ్‌లో అత్యంత అప్రమత్తతతో వాహనం నడిపి ప్రమాదాన్ని నివారించిన డ్రైవర్ శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా సీపీ అభినందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీలు ప్రతాప్,రమేష్,ఆర్ఐ ఎంటీఓ మల్లేశం, రమేష్,ఆర్ఎస్ఐ సరిత,సీసీ సందీప్, ఇతర పోలీస్ అధికారులు,డ్రైవర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# సంగారెడ్డి పట్టణంలో ఘనంగా వనమహోత్సవం



సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు :25(విజన్ ఆంధ్ర )పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవం సందర్భంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని 33వ వార్డులో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, వార్డు కౌన్సిలర్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. అనంతరం నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, సకాలంలో వర్షాలు కురవడానికి చెట్లు ప్రధాన ఆధారమని అన్నారు. కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటిని సంరక్షించి వృక్షాలుగా తీర్చిదిద్దే బాధ్యతను స్థానిక ప్రజలు, యువత తీసుకోవాలని ఆమె కోరారు. సంగారెడ్డి నియోజకవర్గాన్ని పచ్చదనంతో నింపేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, శుభకార్యాల సందర్భంగా కనీసం ఒక మొక్కనైనా నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీకాంత్ గౌడ్, వంశీ, సంగీత మహేష్, రమేష్, అశ్విన్, కాంగ్రెస్ నాయకులు శివుడు, గడ్డం రాజు, ప్రవీణ్, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానించిన ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ

హైదరాబాద్, ఆగస్ట్ 25 (విజన్ ఆంధ్ర): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, ఉపాధ్యాయ రత్న రాష్ట్రస్థాయి, అక్షర బ్రహ్మ పురస్కారాలు–2026 ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డా.ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా బోధనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళలు, క్రీడలు, యోగా రంగాల్లో సేవలందిస్తున్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హతలు, బోధన–శిక్షణ అనుభవాలు, సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికా క్లిప్పింగ్స్, గతంలో పొందిన అవార్డుల వివరాల జిరాక్స్ కాపీలతో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జతచేసి ఆగస్టు 28 లోపు పంపించాలని కోరారు. దరఖాస్తులను 'ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ', డోర్ నెం. 1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు: తిరుమలగిరి, సికింద్రాబాద్–15 చిరునామాకు పంపించాలని తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవం సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర పూర్తి వివరాలకు ఫోన్: 9652347207ను సంప్రదించాలని తెలిపారు.

# వైజాగ్ కు మంచి నీటి సమస్య తీరినట్టే

విశాఖపట్టణం ఆగస్టు 25,ఏపీ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న నగరం ఏది అని అడిగితే విశాఖ అనే చెప్తారు. భవిష్యత్‌లో వైజాగ్‌కు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ వెయ్యి కోట్లు ఖర్చు చేయనుంది. గోదావరి నుంచి నేరుగా నగరానికి తాగునీరు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి నారాయణ కూడా స్పష్టం చేశారు. ఇప్పటికే టెండర్లు పిలిచిన ప్రభుత్వం అతి త్వరగానే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి విశాఖ వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. విశాఖపట్టణం ప్రజలకు ఇది శుభవార్తే అని చెప్పొచ్చు. నీటి కష్టాలతో ఇబ్బంది పడుతున్న విశాఖ నగరానికి ఉపశమనం కలిగించే వార్తను రాష్ట్ర ప్రభుత్వం అందించింది.

# రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం సాధించాలి

## –అదనపు కలెక్టర్ పాండు






సంగారెడ్డి బ్యూరో,ఆగస్టు :25(విజన్ ఆంధ్ర ) జిల్లాలో వివిధ రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను వంద శాతం సాధించేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 2026 మాసాంతానికి పంట రుణాలు, వ్యవసాయ మరియు ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి బ్యాంకుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని అదనపు కలెక్టర్ సమీక్షించారు. పంట రుణాల పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు అన్ని బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కొన్ని బ్యాంకులు లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు అందిస్తున్నప్పటికీ, మరికొన్ని బ్యాంకులు ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించడం లేదని పేర్కొన్నారు. బ్యాంకుల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, తదుపరి సమావేశం నాటికి వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధికి చేయూత అందించాలని తెలిపారు. రుణాలు పొందిన లబ్ధిదారులు యూనిట్లను ఏర్పాటు చేశారా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో బ్యాంకు లింకేజీ రుణాలు అందించాలని, సబ్సిడీ రుణాల మంజూరులో ఎలాంటి జాప్యం చేయవద్దని బ్యాంకర్లకు సూచించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో వీధి వ్యాపారులకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా బ్యాంకులకు అందిన రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తులను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం సుధీర్ కుమార్ మాట్లాడుతూ, జూన్ 2026 మాసాంతానికి జిల్లాలో క్రెడిట్–డిపాజిట్ (సీడీ) రేషియో 196.40 శాతంగా నమోదైందని తెలిపారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, పరిశ్రమల శాఖ జీఎం తుల్జా నాయక్, ఆర్.బి.ఐ రీజినల్ మేనేజర్, మెప్మా అధికారులు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, ఐటీఐ. కోర్సుల్లో అడ్మిషన్ లకు ఆహ్వానం

## ఐటిఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ మహమ్మద్ ఖలీమ్

గద్వాల ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థులకు 2026–27, 2026–28 విద్యా సంవత్సరానికి గాను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), ఐటీఐలో (ఎన్ సివిటి) ప్యాటర్న్ కింద ఇంజినీరింగ్ నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల కొరకు వాకిన్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ మహమ్మద్ ఖలీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ గద్వాలలో అందుబాటులో ఉన్న ట్రేడ్స్ వివరాలు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ – 2 సంవత్సరాల కోర్స్, .మెకానిక్ డీజిల్– 1 సంవత్సరం కోర్సు కలవని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏ.టి.సి) గద్వాలలో అందుబాటులో ఉన్న ట్రేడ్స్ వివరాలుసి ఎన్ సి మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్, వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ – 2 సం. కోర్స్ ,ఇంజనీర్ డిజైన్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్– 1 సంవత్సరం కోర్సు కలవని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ దరఖాస్తు కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని, తమకు కావలసిన కళాశాలలో ఈ నెల 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఉదయం 11:00 గంటలలోపు హాజరు కావాలని సూచించారు.
తేదీల వారీగా హాజరైన విద్యార్థుల మెరిట్ ఆధారంగా, ఆ రోజు వరకు మిగిలి ఉన్న సీట్లకు మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 8341441763 మరియు 9640407866 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# పూరి గుడిసె దగ్ధం రోడ్డున పడ్డా బతుకులు

## రూ.1 లక్ష 50 వేలు,తులం బంగారు అగ్నికి ఆహుతి



గద్వాల ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర)గద్వాల పట్టణం దౌదర్‌పల్లికి చెందిన జమ్ములమ్మ కృష్ణారావు పూరిగుడిసె ప్రమాదవశాత్తు సిలిండ్ నుంచి మంటలు వ్యాపించి, గుడిసెకు మంటలు అంటుకుని అగ్నికి ఆహుతి అయింది. గుడిసెలోని రూ.లక్షా యాభై వేల రూపాయాలు, తులంన్నర బంగారం ఆభరణాలు,బియ్యం, బట్టలు తదితర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఆ కుటుంబం ఉన్న నివాసం కోల్పోయి రోడ్డున పడింది. ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వార్డు కౌన్సిలర్ జగదీష్ కోరారు.

## రక్షాబంధన్ సందర్భంగా బ్లూడార్ట్ 'యాదోంకాబంధన్' వేడుక



హైదరాబాద్, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర): రక్షాబంధన్ సందర్భంగా బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ యాదోంకాబంధన్ ప్రచారంలో భాగంగా ప్రత్యేక రాఖీ ఎక్స్‌ప్రెస్ షిప్పింగ్ ఆఫర్లను అందిస్తున్నట్లు బ్లూడార్ట్ ప్రతినిధులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఆగస్టు 28 వరకు దేశీయ ప్రాధాన్య షిప్‌మెంట్లపై 0.5–2.5 కిలోల వరకు ప్రత్యేక ఫ్లాట్ రేట్లు, అర్హత కలిగిన 0.5–3 కిలోల అంతర్జాతీయ షిప్‌మెంట్లపై 50 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు చెప్పారు. దేశీయ ఆఫర్ ధరలు 0.5 కిలోలకు రూ.200 నుంచి 2.5 కిలోలకు రూ.1,000 వరకు, ఆగస్టు 24–28 మధ్య రూ.300 నుంచి రూ.1,100 వరకు ఉన్నాయన్నారు. ఈ ఆఫర్లు బ్లూ డార్ట్–డీహెచ్ఎల్ రిటైల్ స్టోర్లు, ఫ్రాంచైజీ కలెక్షన్ సెంటర్లలో లభిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు బ్లూ డార్ట్ కస్టమర్ కేర్ 02240611234ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాలను హరికట్టగలం

## డీసీపీ కె నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 25,( విజన్ ఆంధ్ర): ప్రజల భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాలను అరికట్టగలమని మహేశ్వరం జోన్ డీసీపీ కే నారాయణ రెడ్డి అన్నారు. పత్రికా సమాచార కార్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)' కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మీడియా ప్రతినిధులకు వార్త మీడియా వర్క్‌షాప్‌ను మంగళవారం రోజు నిర్వహించారు. మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈగల్ ఫోర్స్ పోలీస్ సూపరింటెండెంట్ రావుల గిరిధర్ (ఐపీఎస్), పీఐబీ– హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మహేశ్వరం ఎంపీడీవో శ్రీమతి ఎన్. శారదమ్మ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) మాట్లాడుతూ డ్రగ్స్ భూతాన్ని ఎదుర్కొనేందుకు చట్టపరమైన ఆంక్షలు మాత్రమే సరిపోవు.. ప్రజలందరి భాగస్వామ్యంతోనే దాన్ని సమర్థంగా కట్టడి చేయగలం అన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, సంబంధిత కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఎస్ఐడీ, ఆక్టోపస్, సీఐఎస్ఎల్, ఈగల్ ఫోర్సుల వంటి బలమైన ప్రత్యేక బలగాలతోపాటు స్థానిక పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మాదకద్రవ్య నివారణ చర్యలు ఇళ్లలోనే, బడుల్లోనే మొదలుకావాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, సహచరులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సకాలంలో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా డ్రగ్స్ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడుకోవడాన్ని శాంతిభద్రతల అంశంగా మాత్రమే చూడలేమన్నారు. వారి ఆరోగ్యాన్నీ, నైపుణ్యాన్నీ, సామర్థ్యాన్నీ పెంపొందించడంలోనూ ఇది అత్యావశ్యకమన్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్




కార్యక్రమాలు నేడు దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారాయని కె. నారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణం దిశగా ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ధ్రువీకృత సమాచారాన్ని ప్రసారం చేయాలనీ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను చెప్పాలనీ, డ్రగ్స్ బారిన పడకుండా యువతను ముందస్తుగానే జాగరూకులను చేయాలనీ, కౌన్సెలింగ్ పునరావాస సేవలపై ప్రజలకు తగిన సమాచారాన్ని అందించాలనీ మీడియా సిబ్బందిని ఆయన కోరారు. మాదకద్రవ్యాలను అరికట్టే దిశగా సమన్విత చర్యలను వివరించిన ఈగల్ ఫోర్స్ ఎస్పీ నషా ముక్త్ భారత్ అభియాన్ పై అవగాహన సదస్సులో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసు సూపరింటెండెంట్ రావుల గిరిధర్ (ఐపీఎస్) మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత, కుటుంబ సమస్య స్థాయిని దాటి.. నేడు తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించిందన్నారు. ఈ ముప్పును ఎదుర్కొనే దిశగా సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నీ సమన్వయంతో కృషి చేయాలన్నారు. జనవరి నుంచి తెలంగాణలో దాదాపు 8 వేల కేజీల గంజాయిని ఈగల్ ఫోర్స్ సీజ్ చేసిందని ఆయన తెలిపారు. దాదాపు 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికీ, ఇతర శాఖల అధికారులకూ శిక్షణ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సమన్విత చర్యల్లో మీడియా సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైనదని రావుల గిరిధర్ అన్నారు. బాధ్యతాయుతమైన సున్నితత్వంతో కూడిన రిపోర్టింగ్ ద్వారా యువతలో అవగాహనను పెంపొందించవచ్చనీ, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చనీ, పునరావాస చర్యలను ప్రోత్సహించవచ్చనీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులను నివేదించేటప్పుడు కచ్చితత్వాన్నీ, సున్నితత్వాన్నీ దృష్టిలో పెట్టుకోవాలని మీడియా సిబ్బందిని కోరారు. ముఖ్యంగా మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచాలనీ, మాదకద్రవ్యాల బారిన పడ్డవారి వ్యక్తిగత వివరాలను అనవసరంగా బహిర్గతం చేయొద్దనీ సూచించారు. నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో.. పోలీసులు మీడియా మధ్య బలమైన సమన్వయం, జాగ్రత్తతో కూడిన ప్రజల భాగస్వామ్యం అత్యావశ్యకమని ఆయన వ్యాఖ్యానించారు. పీఐబీ– హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ ప్రారంభోపన్యాసం చేశారు. డ్రగ్స్ ముప్పు ఇకపై వ్యక్తిగత సమస్యో, కుటుంబ సమస్యో కాదనీ, నేడు ఇదొక తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించింది అని ఆయన అన్నారు. వార్త వర్క్‌షాప్ ద్వారా కచ్చితమైన సమాచారమూ, బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాలతో జర్నలిస్టులను సన్నద్ధులను చేయడమే పీఐబీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తద్వారా వారు నషా ముక్త్ భారత్ అభియాన్‌కు అర్థవంతంగా దోహదపడి, మాదకద్రవ్యాల వ్యాప్తిని నివారించడంలో దోహదపడతారన్నారు. అనంతరం వక్తలతో... జర్నలిస్టులు మాట్లాడారు. కార్యాచరణ సమస్యలు, పునరావాస సేవల లభ్యత, మాదకద్రవ్యాల సంబంధిత కథనాల రిపోర్టింగ్ వంటి విషయాలపై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పీఐబీ– హైదరాబాద్ మీడియా– కమ్యూనికేషన్ అధికారి శ్రీమతి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది మీడియా ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గిరవెల్లిగెర్రె రహదారిపై వరి నాట్లు వేసి బీఆర్ఎస్ నాయకులు నిరసన

దహేగం ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) కొమురం భీం జిల్లా దహేగం మండలం గిరవెల్లిగెర్రె గ్రామాల మధ్య రహదారి అధ్వాన్నంగా మారడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినూత్న నిరసన చేపట్టారు. రోడ్డుపై పేరుకుపోయిన బురదలో వరి నాట్లు వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారి మరింత దారుణంగా మారిందని తెలిపారు. భారీగా బురద పేరుకుపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు అస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణానికి గతంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తీవ్రంగా ప్రయత్నించారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. అటవీ ప్రాంతం కావడంతో అటవీ శాఖ అనుమతులు అవసరమయ్యాయని అన్నారు. అనుమతులు రాకపోవడంతో రహదారి నిర్మాణ పనులు ముందుకు సాగలేదని వివరించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాల్వాయి హరీష్ బాబు రహదారి నిర్మాణంపై హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రంతో మాట్లాడి అటవీ అనుమతులు తీసుకొస్తానని చెప్పారని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా రహదారి నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. అటవీ శాఖ అనుమతులు ఎందుకు తీసుకురాలేకపోయారని నిలదీశారు. గతంలో ఎక్కడ బురద కనిపించినా అక్కడ వరి నాట్లు వేసి నిరసన తెలిపిన హరీష్ బాబు, ఇప్పుడు అధికారంలో ఉండి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. గిరవెల్లి ˙గెర్రె రహదారి నిర్మాణానికి అవసరమైన అనుమతులను త్వరితగతిన



తీసుకురావాలని కోరారు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా రహదారిని మరమ్మతు చేయాలని కోరారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ ప్రయాణించే ప్రజల కష్టాలను అధికారులు గుర్తించాలని సూచించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేయడం సరికాదని విమర్శించారు. తక్షణమే సంబంధిత శాఖల అధికారులు రహదారిని పరిశీలించాలని కోరారు. అటవీ శాఖ, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు తీసుకువచ్చి పనులు ప్రారంభించాలని అన్నారు. ప్రజల ఇబ్బందులు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. గిరవెల్లి ˙గెర్రె రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బెజ్జూర్‌లో కాంగ్రెస్ మండల సర్వసభ్య సమావేశం



బెజ్జూర్ ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) కొమరం భీం జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు పంద్రం పుష్పలత అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హాజరయ్యారు. ఎమ్మెల్సీ దండే విఠల్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కమిటీ ఎన్నికలపై చర్చించారు. మండల కమిటీ ఎన్నికకు ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంపై నాయకులు దృష్టి సారించారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆత్రం సుగుణక్క సూచించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నాయకులు కృషి చేయాలని అన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మండల కమిటీ ఎన్నిక ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి నహిర్ అలీ పాల్గొన్నారు. డీసీసీ ఉపాధ్యక్షులు కొండ్ర జగ్గగౌడ్ సమావేశానికి హాజరయ్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్ పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి పెంటన్నతో పాటు మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి. హాజరయ్యారు. మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మండల కమిటీ ఎన్నికలతో పార్టీకి మరింత బలోపేతమైన నాయకత్వం ఏర్పడుతుందని నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకుంది

## – పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :25(విజన్ ఆంధ్ర) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. మంగళవారం నాడు గాంధీభవన్లో ఆయన మాట్లాడుతూ లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా వెళ్లకుండా నిలిపివేయడం వెనుక కారణం ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్య స్వేచ్ఛ బందీ అయిందని, అన్నారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. , కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛతో పాటు ధర్నాలు చేసుకునే స్వేచ్ఛను కల్పించిందన్నారు. ఇందిరా పార్క్‌లో తమ డిమాండ్ల కోసం ఎవరైనా ధర్నాలు చేసుకునే అవకాశం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, స్మార్ట్ రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతు రుణమాఫీ 90 శాతం పూర్తయ్యిందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని జగ్గారెడ్డి ఆరోపించారు. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా వెళ్లకుండా నిలిపివేయడం వెనుక కారణం ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన ముఖ్యమంత్రి కావడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇది తెలంగాణ ప్రజలను అవమానించినట్టేనని అన్నారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, రేవంత్ రెడ్డి దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తిని కలవడానికి వెళు_న్నారని ఆరోపించడం సరికాదన్నారు. ఇదే సమయంలో ప్రధాని మోదీ గతంలో పాకిస్థాన్‌కు వెళ్లి అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్‌ను కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సందర్భంపై కూడా బీజేపీ సమాధానం






చెప్పాలని డిమాండ్ చేశారు. అమెరికా పర్యటనలాంటి అధికారిక కార్యక్రమాలకు సంబంధిత దేశంలోని భారత రాయబార కార్యాలయానికి పూర్తి సమాచారం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో అమెరికా పర్యటనను ఎందుకు నిలిపివేశారో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని జగ్గారెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నాయకత్వంపై పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, రేవంత్ రెడ్డి సమతుల్యంగా వ్యవహరించారని, అనవసర ఊహాగానాలకు తావు ఇవ్వొద్దని సూచించారు.

# భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే వన మహోత్సవం లక్ష్యం

## –జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు :25(విజన్ ఆంధ్ర)వన మహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించి పెద్దవిగా పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు పెరిగితేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటుతున్నారని చెప్పారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఇంటి వద్ద ,పరిసరాలలో నాటుకునేలా అవసరమైన మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దీనివల్ల ప్రతి ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెంపొందడంతో పాటు పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని, తద్వారా మొక్కల వివరాలను నమోదు చేసి వాటి సంరక్షణపై పర్యవేక్షణ





కొనసాగిస్తామని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, డీఆర్‌డీఓ జ్యోతి, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ లలితాదేవి, పీసీబీ అధికారి విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ చలపతిరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తహసీల్దార్ జయరాం నాయక్, అటవీ శాఖ అధికారులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# టిబి నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్యాధికారి ఆదేశం

సంగారెడ్డి బ్యూరో,ఆగస్టు :25(విజన్ ఆంధ్ర )జిల్లాలో క్షయ (టీబీ) నిర్మూలన లక్ష్యాలను వేగవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితా దేవి సూచించారు.

మంగళవారం నాడు డి యం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులు లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీలు , డేటా ఎంట్రీ ఆపరేటర్లు లకు టీబీ నియంత్రణ చర్యలు, వ్యాధి గుర్తింపు, చికిత్స నమోదుకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక శిక్షణ నిర్వహించాలని ఆదేశించారు. టీబీ లక్షణాలు ఉన్న వ్యక్తులను సకాలంలో గుర్తించి పరీక్షలకు పంపించడం, చికిత్సలో ఉన్న రోగులను నిరంతరం పర్యవేక్షించడం, నిక్షయ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదు, కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి అనుమానిత టీబీ రోగిని పరీక్షలు చేయించి, నిర్ధారణ అనంతరం చికిత్సను త్వరగా ప్రారంభించడంతో పాటు చికిత్స పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టీబీ నిర్మూలనలో ప్రతి సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని డా. కె. లలితా దేవి పిలుపునిచ్చారు.

# కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి. ఆగస్టు 25: (విజన్ ఆంధ్ర)కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొండాపూర్ జిల్లా ఆసుపత్రికి సంబంధించిన 'ఆసుపత్రి అభివృద్ధి కమిటీ' సమావేశం లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి (ఖాూా) డి ఎం హెచ్ ఓ డాక్టర్ స్వర్ణకుమారి , ఇన్‌ఛార్జ్ ఐజనూ డాక్టర్ సుధాకర్ బండారి ఇన్‌ఛార్జ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణ మరియు ఇతర కమిటీ సభ్యులు ఆసుపత్రి సిబ్బంది తో కలిసి పాల్గొన్న పి ఎ సి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండాపూర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని, ప్రజా ఆరోగ్యమే పరమావధిగా డాక్టర్లు సేవలు అందించాలని, డాక్టర్లు కనిపించే దేవుళ్లతో సమానం అని, పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రజలకు మంచి నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల నుండి మన్ననలు పొందాలని కొండాపూర్ జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేయడం మరియు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం పట్ల ప్రతి ఒకరు నిబద్ధత తో పనిచేయాలని, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా కొండాపూర్ ఆసుపత్రిని తీర్చిదిద్దడం జరిగినది అని, కొండాపూర్ జిల్లా ఆసుపత్రి ని అన్ని రకాల మౌలిక వసతులతో, అన్ని హంగులతో ,సకల సౌకర్యాలతో ఆసుపత్రి ని తీర్చిదిద్దడం జరిగినది అని, ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని, 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ భవనం పనులు కొనసాగుతున్నాయి అని, త్వరలోనే అందుబాటులోకి వస్తుంది అని . ఆసుపత్రి అభివృద్ధి మరియు నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ప్రాథమిక మౌలిక సదుపాయాలు మరియు అత్యవసర ఆసుపత్రి సేవలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టిసారించిన ఈ సమావేశం సానుకూల మరియు నిర్మాణాత్మక ఫలితాలను ఇచ్చింది అని, విస్తృత చర్చల అనంతరం, డ్రైనేజీ, విద్యుత్ మరియు పారిశుధ్యం/శుభ్రతకు సంబంధించిన పలు తీర్మానాలను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. తీర్మానాలను త్వరితగతిన అమలు చేయడం, అలాగే ఆసుపత్రి మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత మరియు రోగులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని సభ్యులు తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. కొండాపూర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ఏ అవసరం ఉన్న, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామనికొండాపూర్ జిల్లా ఆసుపత్రి లో రూ. 40 కోట్ల 50 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మించబోయే 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం భవనం నిర్మాణం పనులను పరిశీలించడం జరిగినది. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువాలని, పనులలో వేగం పెంచాలని, పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదు అని, భవనం నిర్మాణం పై అధికారులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది. 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం అందుబాటులోకి వస్తే ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలిపారు కార్యక్రమంలో 'ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు ఆసుపత్రి సిబ్బంది నాయకులు రఘునాథ్ రెడ్డి, రఘు నందన్ రెడ్డి, మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బలరాం యాదవ్, తిరుపతి,సాదిక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మంచిప్ప రిజర్వ్ ఫారెస్ట్ లో ఘనంగా వన మహోత్సవం



నిజామాబాద్, ఆగస్టు25:( విజన్ ఆంధ్ర) : పనమహోత్సవం సందర్భంగా నిజామాజాద్ అటవీ శాఖ అధ్వర్వంలో మాంచిప్ప రిజర్వ్ ఫారెస్ట్లోని కంపార్ట్మెంట్ నం. 180, మల్లారం బిట్, మల్లారం సెక్షన్, నిజామాబాద్ నార్త్ రేంజ్ పరిధిలో మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి గౌరవనీయులైన డివిజనల్ ఫారెస్ట్ అఫీసర్ (DFO), ఫారెస్ట్ డివిజనల్ అఫీసర్ (FDO), ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (FRO), నిజామాజాద్ నార్త్ పాటు అటవీ శాఖ సిబ్బంది హాజరయ్యారు. అలాగే మాల్యాపూర్, మల్లారం, గాంధీనగర్, ధర్మారం మరియు చక్రధర్ నగర్ గ్రామాల సర్పంచ్లు కార్యక్రమంలో పాల్గోన్నాదు. గ్రామా మల్లారం మరియు సెయింట్ జేవియర్ స్కూల్, నిజామాబాద్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా మొక్కలు నాటి, పనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమం ద్వారా హరితపనం పెంపొందించడం, అడవుల పరిరక్షణ, పర్యావరణ పరిరిక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ముఖ్యంగా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత కల్పించారు. వనమహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు అటవీ శాఖ సిబ్బందికి అటవీ శాఖ కృతజ్ఞతలు తెలియజేసింది.

# ఇందిరమ్మ ఇళ్ళ పురోగతి, డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపుపై కలెక్టర్ సమీక్ష



నిజామాబాద్, ఆగస్టు 25 :(విజన్ ఆంధ్ర ) : ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల పురోగతి, రెండు పడక గదుల కేటాయింపుపై కలెక్టర్ భవేష్ మిశ్రా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష జరిపారు. వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి సత్వరమే గృహ ప్రవేశాలు జరిగేలా చొరవ చూపాలన్నారు. రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికి కేటాయించడం జరుగుతోందని కలెక్టర్ గుర్తు చేశారు. ఇంకనూ అర్హుల జాబితాను ఖరారు చేయని ఆయా మండలాల అధికారులు తక్షణమే లాటరీ విధానం ద్వారా లబ్దిదారులను ఎంపిక చేసి జాబితా రూపొందించాలని, పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని చోట్ల డబుల్ బెడ్ రూమ్ ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం, ప్రస్తుత పరిస్థితి, మిగిలి ఉన్న పనులు, అవసరమైన మరమ్మతులకు సంబంధించిన వివరాల గురించి కలెక్టర్ మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. కేటాయింపులకు సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి వచ్చేలా చూడాలన్నారు. విద్యుత్, నీటి సరఫరా, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించిన తర్వాత ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయ కుమారి, హౌసింగ్ డీ.ఈ లు గంగాధర్, రాజ్యలక్ష్మి, ఎ.ఈ నివర్తి, అన్ని మండలాల తహసీల్దార్ లు, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నగరంలో నకిలీ వైద్యుల దందా

**- 11మందిని అరెస్ట్ చేసిన టాస్క్ఫోర్స్**

హైదరాబాద్,ఆగస్టు 25 : హైదరాబాద్ నగరంలో నకిలీ వైద్యుల ముఠాపై టాస్క్ఫోర్స్ పోలీసులు విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లో ఏకంగా 11 మంది నకిలీ డాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పేరుతో సృష్టించిన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని, వీరు నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో ఏకంగా క్లినిక్లు తెరిచి ప్రాక్టీస్ చేస్తున్నారు. ఎటువంటి అర్హత లేకపోయినా రోగులకు అల్లోపతి వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వీరు నగరంలో ఎక్కడెక్కడ క్లినిక్లు నిర్వహిస్తున్నారు? ఏయేవిశ్వవిద్యాలయాల నుంచి నకిలీ సర్టిఫికెట్లు పొందుపరిచారు? రోగులకు ఎలాంటి వైద్యం, మందులు అందిస్తున్నారు? అనే కీలక అంశాలపై పోలీసులు ప్రస్తుతం లోతుగా విచారణ జరుపుతున్నారు. అర్హత లేని నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నకిలీ ధ్రువపత్రాలతో వీరంతా వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఇలా 11 మందిని టాస్క్ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా క్లినిక్లు ఏర్పాటు చేసి ప్రజలకు సెలైన్లు, ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నట్లు గుర్తించినట్లు టాస్క్ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. పారామెడికల్ కోర్సు చేసిన ఓ మహిళ అనుమతులు లేకుండా నాలుగేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన 11 మంది నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకుని మందులను స్వాధీనం చేసుకున్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి: కలెక్టర్

భువనగిరి,ఆగస్టు 25 : ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ ఏపూరి భాస్కరరావు పేర్కొన్నారు. భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామ పంచాయితిలో వనమహోత్సవము కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని వన మహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. డీఆర్డీవో నాగిరెడ్డి, డీయఫ్వో సుధాకర్ రెడ్డి, సీఈవో జడ్పీ శోభారాణి, డీపీవో శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి ర్యాకల సంతోష తదితరులు పాల్గొన్నారు.

# ధరల మంట.. సామాన్యుడి కంట!!

- ధరలు పైపైకి.. ఆదాయం కిందకే
- పాలు నుంచి గ్యాస్ దాకా.. మోతే
- వంటింటిపై ధరల దాడి
- ధరల భారంతో కుటుంబ బడ్జెట్ చిత్తు
- ప్రభుత్వాలు నిద్రపోతున్నాయా?
- నల్లబజారుపై నిఘా ఎక్కడ?




**హైదరాబాద్, ఆగస్టు 25:**
శాలరీ మెసేజ్ వచ్చింది... కానీ గుండెల్లో దడ మొదలైంది. నెల ఒకటో తేదీన ఫోన్ స్క్రీన్పై "శాలరీ క్రెడిటెడ్" అనే బ్యాంక్ నోటిఫికేషన్ మెరిసిన మరుక్షణమే.. మధ్యతరగతి జీవి కళ్లముందు పరుగు పందెం మొదలవుతుంది. ఆ అంకెల వెలుగు ఆరకముందే, జేబులోంచి పైసలు ఆవిరైపోయే వింత మాయాజాలం ఇది. ధరల రాకెట్ ఆకాశంలోకి దూసుకుపోతుంటే, సామాన్యుడి ఆదాయం మాత్రం నేలచూపులు చూస్తూ నిలకడగా నిలబడిపోతోంది.

## ప్లేటులోని కూరగాయల నుంచి తరగతి గది దాకా.. అంతా భగ్గుమనే మంటలే

### మార్కెట్ కన్నీళ్లు

సంచి నిండా కూరగాయలు తెచ్చిన రోజులు పోయి, జేబు నిండా డబ్బులు తీసుకెళ్లి గుప్పెడు కూరగాయలు తెచ్చుకునే పరిస్థితి. ఉల్లిపాయ ధరలు కోయకుండానే కళ్లలో నీళ్లు తెప్పిస్తున్నాయి.




### వంటింటి భారాలు

పప్పులు, నూనె, చక్కెర, బియ్యం.. నిత్యావసరాల స్టులో ఏ ఒక్కదాన్ని ముట్టుకున్నా షాక్ తగలడం ఖాయం. రోజూ తాగే గుక్కెడు పాల నుంచి మొదలుకొని, వంటింట్లో ఎగసిపడే సిలిండర్ మంట వరకు అన్నీ బడ్జెట్ను బూడిద చేస్తున్నాయి.

### రోజువారీ ఖర్చులు

నెలాఖరుకు వచ్చే విద్యుత్ బిల్లు ఫ్యూజులు ఎగరేస్తుంటే, పెట్రోల్డీజిల్ రేట్లు, ఆటో–బస్సు ప్రయాణ ఖర్చులు రోజువారీ తిరుగుడును భారంగా మార్చేశాయి.


### భవిష్యత్తుపై భారం

వీటన్నింటికీ మించి.. పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాలు, డొనేషన్ల రూపంలో చదువుల భారం ఒక కంటికి నిద్రలేకుండా చేస్తోంది. ఈ ఆధునిక జీవన చక్రంలో సామాన్యుడు సంపాదించే ప్రతి రూపాయికి ముందే ఒక చిరునామా రాసిపెట్టి ఉంటోంది. సరదాలు, సంతోషాలు పక్కనబెట్టి.. కేవలం 'నెల గడిస్తే చాలు' అనే సర్వైవల్ మోడ్లోకి మధ్యతరగతి కుటుంబాలు జారిపోతున్నాయి. ఆదాయం నెమ్మదిగా పాకుతుంటే, ఖర్చులు మాత్రం గాల్లో ఎగురుతున్నాయి. ఆకాశాన్నంటుతున్న ఈ ధరల తాకిడికి.. సంసారాన్ని ఈదుతూ, ఆశలని మోస్తూ, చిరునవ్వు వెనుక లెక్కల భారాన్ని దాచుకుంటున్న ప్రతి సామాన్యుడి పోరాటం నిజంగా ఒక నిశ్శబ్ద యుద్ధమే.

## ప్రభుత్వాలు నిద్రపోతున్నాయా?

### నల్లబజారుపై నిఘా ఎక్కడ?

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలతో సామాన్యుడి జేబు కాలిపోతుంటే పాలకుల కళ్లకు




ఈ వాస్తవాలు కనిపించడం లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ధరల నియంత్రణ కమిటీలు కేవలం కాగితాలకే పరిమితమై, నల్లబజారు, అక్రమ నిల్వలను అరికట్టాల్సిన నిఘా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర దక్కక, వినియోగదారుడిపై భారం తగ్గక మధ్యవర్తులే లాభపడుతున్నారు. సబ్సిడీల ప్రకటనలు ఆర్భాటంగా ఉన్నా వాటి ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో సామాన్యుడికి చేరడం లేదు. నిత్యావసరాలపై పన్నుల భారాన్ని తగ్గించాల్సిన కేంద్రం, రాష్ట్రాలు మార్కెట్ జోక్య నిధులతో రాయితీపై సరుకులు అందించాల్సిన అవసరం ఉంది. ఓట్ల సమయంలో ఉచిత హామీలు ఇచ్చే ప్రభుత్వాలు, ప్రజల రోజువారీ బతుకు భారాన్ని తగ్గించే శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. ధరల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోకపోతే సామాన్యుడి జీవనం మరింత భారమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని ధరల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# పార్కు అడిగితే.. "ప్రహరీ గోడ ఇచ్చారే..!"

- ప్రజా ప్రయోజనాల స్థలాలతో ప్రయోజనం ఎవరికో..?
- పిల్లలకు ఆటస్థలం ఏదీ..?
- 7.6 ఎకరాలు ప్రజల కోసం.. కానీ ప్రజలకు దక్కింది ఎంత..?
- 10% ప్రజా ప్రయోజనాల స్థలంపై కాలనీవాసుల ప్రశ్నలు..!"




**ఆదిలాబాద్, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ రెండవ జోన్ లో హౌసింగ్ బోర్డ్ అధికారులు నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణం చర్చనీయాంశంగా మారింది. న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మూడు జోన్ల పరిధిలో 76.18 ఎకరాల విస్తీర్ణంలో హౌసింగ్ బోర్డ్ శాఖకు సంబంధించిన స్థలం ఉంది. అయితే తెలంగాణ లేఅవుట్ నిబంధనల ప్రకారం సాధారణ లేఅవుట్ మొత్తం భూమిలో కనీసం 10% భూమిని అనగా 7.6 ఎకరాల స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలి.

## అందులో సాధారణంగా

- 7.5% పార్కులు, ఆట స్థలాలు..
- 1% సామాజిక మౌలిక సదుపాయాలు..
- 1% యుటిలిటీస్..
- 0.5% కామన్ పార్కింగ్.. వంటి అవసరాలకు కేటాయించాలి.
- 10శాతం స్థలాన్ని కేటాయించాలి : కాలనీవాసులు

అయితే కాలనీవాసులు అందిస్తున్న సమాచారం మేరకు ప్రజాప్రయోజనాల కోసం 7.6 ఎకరాల స్థలాన్ని హౌసింగ్ బోర్డ్ అధికారులు కేటాయించలేదని వారి ప్రధాన ఆరోపణ..! గతంలో హౌసింగ్ బోర్డ్ అధికారులు రెండవ జోన్ కు పార్కు స్థలాన్ని కేటాయించగా... దాన్ని ప్రభుత్వం ఆక్రమించి, పాఠశాల భవనాన్ని నిర్మించి అందులో ప్రభుత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారని అక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో చిన్న పిల్లల ఆటవిడుపుకు సంబంధించిన ఆ ఒక్క సౌకర్యాన్ని సైతం గతంలోనే కోల్పోయామని వాపోతున్నారు. ప్రస్తుతం మళ్ళీ నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణంతో... మంచి ఆరోగ్యం కోసం రోజు వృద్ధులు, యువకులు, పిల్లలు ఉదయం మరియు సాయంత్రం వేళల్లో కసరత్తులు చేసే ఓపెన్ జిమ్ తో పాటు యువకులు ఆటలాడుకొనే వాలిబాల్ ఆట స్థలాన్ని సహితం కోల్పోతామని పేర్కొంటున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణ ప్రాంతంలో వున్న ఓపెన్ జిమ్ మరియు వాలిబాల్ కోర్ట్ లను ముట్టుకోకుండా వుండాలని కోరుతున్నారు. ఓపెన్ జిమ్ మరియు వాలిబాల్ కోర్టు పోయిన మరుక్షణమే.. మహిళలు ఎంతో భక్తి ప్రపత్తులతో దసరా, గణేష్ నవరాత్రి వేడుకలు జరుపుకునే ప్రాంతం , అలాగే ఎంతో ఆహ్లాదంగా ఇతర పూజాది కార్యక్రమాలను చేపట్టే కమ్యూనిటీ హాల్ సహితం రోడ్డు కోసం కొల్పయే ప్రమాదం ఉందని, వాటిని తొలగించే ప్రక్రియ మొదలు కాకముందే ఇకనైనా కాలనీవాసులందరు మేల్కొనాలని అక్కడి యువకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలోని మూడు జోన్ లలో నివసిస్తున్న ప్రజలకు, చిన్న పిల్లలకు, యువతకు హౌసింగ్ బోర్డ్ శాఖ అధికారులు తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు. ఒకవేళ వాటిని తొలగించే ప్రక్రియ మొదలుపెడితే మాత్రం తాము ఆందోళన కు దిగుతామని అక్కడి యువత, కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. హౌసింగ్ బోర్డ్ అధికారులు చెప్పినట్లు కాలనీలోని మూడు జోన్ ల పరిధిలోని ఏడున్నర ఎకరాల స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించినట్లయితే అది ఎక్కడెక్కడ కేటాయించామనే విషయాన్ని కాలనీవాసులకు వివరంగా చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యపై హౌసింగ్ బోర్డు అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో ఇక వేచి చుడాల్సిందే...!!





## హౌసింగ్ బోర్డు ఎ.ఈ వివరణ...

మరోవైపు విజన్ ఆంధ్ర ప్రతినిధి పై అంశం పై ఆదిలాబాద్ హౌసింగ్ బోర్డ్ ఏఈ అంకం రావు ని వివరణ కోరగా... న్యూ హౌసింగ్ బోర్డ్ లోని మొత్తం 76.18 ఎకరాల విస్తీర్ణంలో 10శాతం స్థలాన్ని అనగా 7.6 ఎకరాల స్థలాన్ని తాము గతంలోనే ఆదిలాబాద్ మున్సిపాలిటీకి అప్ప చెప్పామని పేర్కొన్నారు. మిగతా తమ హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఉన్న స్థలం అన్యాక్రాంతం కాకుండా తాము ప్రస్తుతం ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలోకి 29వ డివిజన్ నుండి చేరికలు



నిజామాబాద్, ఆగస్టు25:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బిగాల గారి ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్ నగరంలోని 29వ డివిజన్కు చెందిన షేక్ మజీద్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ బిగాల షేక్ మజీద్ గారికి పార్టీ కండువా కప్పి సాదరంగా బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు మహమ్మద్ తాజ్, షేక్ సూఫియన్, షేక్ తోఫిక్, షేక్ మెహబూబ్, షేక్ ముకీత్, అబ్దుల్ బషీర్తో పాటు సుమారు 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం రోజురోజుకూ మరింత పెరుగుతోందని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, సిర్ప రాజు, మాజీ చీఖణూ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ మతీన్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, 29వ డివిజన్కు చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నాగారం 2దీఎఖ ఇళ్ల దుస్థితిపై మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆగ్రహం

- బీఆర్ఎస్ హయాంలో నాగారం ప్రాంతంలో 396 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి
- ఇళ్లతో పాటు జజ రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్, విద్యుత్, ఓపెన్ జిమ్, పార్కు స్థలం వంటి అన్ని మౌలిక వసతులు కల్పన
- లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తి
- ఎన్నికల కోడ్ కారణంగా ఇళ్ల పంపిణీ నిలిచిపోయింది
- కేసీఆర్ నిర్మించిన ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా చిత్రీకరించడం సరికాదు
- నిర్లక్ష్యంతో ఇళ్లలో తలుపులు, కిటికీలు, దర్వాజాలు, ప్లంబింగ్, విద్యుత్ వైర్లు ధ్వంసం
- మరమ్మతులు చేయకుండానే ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారని విమర్శ
- ప్రస్తుతం ఇళ్లు నివాసయోగ్యం కాని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన
- వెంటనే నిధులు కేటాయించి ఇళ్లను నివాసయోగ్యంగా మార్చాలని డిమాండ్



నిజామాబాద్, ఆగస్టు25:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ నగరంలోని మంగళవారం నాగారం ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన 396 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మాజీ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బిగాల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా 2దీఎఖ ఇళ్ల దుస్థితిని పరిశీలించి, సమస్యలను మీడియా ద్వారా ప్రజల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ హయాంలో నాగారం ప్రాంతంలో 396 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అన్ని హంగులతో నిర్మించడం జరిగిందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంతో పాటు జజ రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్, విద్యుత్ సదుపాయం, ఓపెన్ జిమ్, పార్కు కోసం స్థలం వంటి మౌలిక వసతులన్నింటినీ పూర్తి చేశామని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తయిందని, అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇళ్ల పంపిణీ నిలిచిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడిచిన తర్వాత, రెండు రోజుల క్రితం హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిజామాబాద్‌కు వచ్చినప్పటికీ నాగారంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సందర్శించలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా చిత్రీకరిస్తూ, రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో కేవలం పది మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారని ఆరోపించారు.ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే అనేక ఇళ్లలో తలుపులు, కిటికీలు, దర్వాజాలు, ప్లంబింగ్ సామగ్రి, విద్యుత్ వైర్లు తదితరాలు ధ్వంసమయ్యాయని తెలిపారు. కనీసం అవసరమైన మరమ్మతులు కూడా చేపట్టకుండా లబ్ధిదారులకు ఇళ్లను అందజేయడం వల్ల అవి ప్రస్తుతం నివాసయోగ్యం కాని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన పర్యవేక్షణలో, తన హయాంలో ఈ ఇళ్ల నిర్మాణం పూర్తయినందున ప్రస్తుత దుస్థితిని చూసి మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల తీవ్రంగా చలించిపోయారని నాయకులు తెలిపారు. వెంటనే ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ధ్వంసమైన తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, విద్యుత్ తదితర సదుపాయాలను పునరుద్ధరించి, ఇళ్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి నివాసయోగ్యంగా మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే ఇవి లిఇందిరమ్మ ఇళ్లు కావని, అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారి హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అని ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలను స్పష్టంగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, సిర్ప రాజు, మాజీ చీఖణాూ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి,,సుజిత్, ప్యాట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

- వరికి బదులు ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి
- సిఎస్ సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్..
- సమీక్షించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను ఆకర్షించే విధంగా వాటి అభివృద్ధికి తగిన సమగ్ర చర్యలు చేపట్టాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు వర్షాభావ పరిస్థితులు, నీట్‌పీజీ పరీక్షల ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వనపర్తి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

*- 27 పర్యాటక ప్రాంతాల ప్రగతి:*

రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. పర్యాటక ప్రదేశాలలో రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పారిశుద్ధ్యం, సూచిక బోర్డులు వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని స్పష్టం చేశారు. స్థానిక కళలు, సంస్కృతి, ఆహారం, హస్తకళలకు ప్రాధాన్యమిస్తూ హోమ్‌స్టేలు, స్థానిక గైడ్‌లను ప్రోత్సహించి ఉపాధి కల్పించాలని చెప్పారు. తెలంగాణ చారిత్రక వారసత్వం, పండుగలను ప్రపంచానికి చాటుతూ 'బ్రాండ్ తెలంగాణ'కు గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

*- ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి:*

రాష్ట్రంలో ప్రస్తుతం 22 శాతం లోటు వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని సీఎస్ వివరించారు. ఇప్పటివరకు 1.20 కోట్ల ఎకరాల్లోనే సాగు జరిగిందని పేర్కొంటూ, తాగు, సాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వీసీ అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి పంటకు బదులుగా మినుములు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలు వేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు చొరవ చూపి ప్రోత్సహించాలని ఆదేశించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, పర్యాటక శాఖ అధికారి సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి

***అమరచింత పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి***







వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణే ధ్యేయంగా పనిచేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆమె ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని అమరచింత పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. రిసెప్షన్, లాకప్, రికార్డులు, జనరల్ డైరీ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిపై ఎస్సై స్వాతిని అడిగి తెలుసుకుని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు.

*- అసాంఘిక శక్తులపై నిఘా:*

గంజాయి, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలి. అనుమానితుల వివరాలను అప్‌డేట్ చేస్తూ, నిరంతర నిఘా ఉంచాలి. సాంకేతికత వినియోగం: దర్యాప్తులో సీసీటీఎన్ఎస్, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, సీఈఐఆర్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సిబ్బంది సమర్థవంతంగా ఉపయోగించాలి.

*- జూరాల పర్యాటకులకు భద్రత:*

జూరాల డ్యాంను సందర్శించే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీ సమయాల్లో బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి.


*- రోడ్డు భద్రత & తనిఖీలు:*

సాయంత్ర వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలి. జాతీయ రహదారి గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రమాద ప్రాంతాల్లో (బ్లాక్ స్పాట్స్) హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

*- క్రమశిక్షణ పాటించాల్సిందే*

పోలీసు సిబ్బంది స్వయంగా విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. హెల్మెట్ లేని సిబ్బందిని విధుల్లోకి అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని సూచించారు. అమరచింత పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డులు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ ఎస్పీ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, అమరచింత ఎస్సై స్వాతి, డీసీఆర్‌బీ ఎస్సై తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటీఐలో వాక్ఇన్ అడ్మిషన్లు




కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర): 202627 విద్యా సంవత్సరానికి శామీర్‌పేట ప్రభుత్వ ఐటీఐతో పాటు అడ్వాన్స్‌డ్ సాంకేతికత కేంద్రం (ూాజ)లో వివిధ ట్రేడ్లలో రెండేళ్ల కోర్సులకు వాక్ఇన్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 5, 2026 వరకు ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు కాగా, 2026 ఆగస్టు 1 నాటికి కనీసం 14 సంవత్సరాల వయస్సు ఉండాలి. డ్రోన్ టెక్నాలజీ కోర్సుకు కనీస వయస్సు 16 సంవత్సరాలుగా నిర్ణయించారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉ‌ఙ.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసి, సంబంధిత ప్రభుత్వ ఐటీఐ/ూాజలో ఉదయం 11 గంటలలోపు హాజరై వాక్ఇన్ అడ్మిషన్ పొందవచ్చు. అభ్యర్థులు ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, స్టడీ సర్టిఫికెట్లు, కులం, స్థానికత తదితర ధ్రువపత్రాలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు కాపీని తీసుకురావాలి. సీట్ల కేటాయింపు మెరిట్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని, ఖాళీగా ఉన్న సీట్లకు మాత్రమే వాక్ఇన్ అడ్మిషన్లు కల్పిస్తామని అధికారులు తెలిపారు. అందుబాటులో ఉన్న ట్రేడ్లలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, జచీజ మెషిన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ కోర్సులు ఉన్నాయి. మరిన్ని వివరాలకు 9866843920, 9866513784, 9553515596 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# నషాముక్త్ సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కీలకం

## - అవగాహన కార్యక్రమంలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా.






నిజామాబాద్ ఆగస్టు25:( విజన్ ఆంధ్ర ) నషాముక్త్ సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. మాదకద్రవ్యాల ప్రభావానికి యువత దూరంగా ఉండి, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, నవకల్పన, దేశసేవ వైపు అడుగులు వేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు.మంగళవారం నిజామాబాద్ లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి' గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'నషాముక్త్ భారత్ అభియాన్' విస్తృత ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోందన్నారు. మాదకద్రవ్యాలపై చట్టపరమైన చర్యలతోపాటు యువతలో అవగాహన, చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం కూడా ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ఈగల్ కార్యక్రమంతోపాటు పోలీసుశాఖ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు, ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థులను చైతన్యవంతం చేయడం మంచి ప్రయత్నమని అన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో మాదక, హానికర పదార్థాల లభ్యతను నియంత్రించడంతో పాటు చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నషాముక్త్ సమాజం కోసం పోలీసు, యంత్రాంగం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని గవర్నర్ సూచించారు. నిజామాబాద్ పోలీసులు చేపడుతున్న విస్తృత అవగాహన కార్యక్రమాలు, సమర్థవంతమైన అమలు చర్యలు ప్రశంసనీయమన్నారు. "యువతలోని శక్తి, ప్రతిభ, కలలే దేశానికి అతిపెద్ద సంపద. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాలకు బలి చేయొద్దు" అని గవర్నర్ విద్యార్థులకు సూచించారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత 'మేల్కొనండి.. లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి' అనే సందేశాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. లోహంలాంటి కండరాలు, ఉక్కులాంటి నరాలు, వజ్రంలాంటి సంకల్పం కలిగిన యువత దేశానికి అవసరమన్నారు. అటువంటి అంకితభావం కలిగిన కొద్దిమంది యువకులు కూడా దేశంలో, ప్రపంచంలో గొప్ప మార్పు తీసుకురాగలరని పేర్కొన్నారు. ఆసక్తి, క్షణిక ఆకర్షణ కారణంగా యువత జీవితం తప్పుదారి పట్టే అవకాశం ఉందని గవర్నర్ హెచ్చరించారు. ప్రతి యువకుడు విచక్షణ, ఆత్మనియంత్రణను జీవితానికి మార్గదర్శకంగా చేసుకోవాలని సూచించారు. మిత్రుల్లో ఎవరైనా నషా వైపు వెళ్తున్నట్లు గుర్తిస్తే వారిని ఒంటరిగా వదిలేయకుండా మార్గదర్శ నంతో సరైన దారిలోకి తీసుకురావాలని అన్నారు. 'నషాకు నో.. జీవితానికి ఎస్' అనే నినాదం కేవలం నినాదంగా కాకుండా ప్రతి యువకుడి జీవిత సంకల్పంగా మారాలని ఆకాంక్షించారు. పిల్లలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం సంభాషిస్తూ నమ్మకం, ఆప్యాయతతో వ్యవహరించాలని గవర్నర్ సూచించారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా తాను పనిచేసిన సమయంలో నషా వ్యతిరేక కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని స్వయంగా చూశానని తెలిపారు. యువత, కుటుంబాలు, విద్యాసంస్థలు, స్థానిక సమాజం కలసికట్టుగా పనిచేస్తే సామాజిక సమస్యలను సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. తెలంగాణలోనూ 'నషాముక్త్ భారత్ జన ఆందోళన్'లిలో భాగంగా జూన్ 19న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యుల సమక్షంలో విద్యార్థులతో నషాముక్త్ జీవితం కోసం ప్రతిజ్ఞ చేయించిన విషయాన్ని గవర్నర్ గుర్తుచేశారు.నిజామాబాద్ మరింత అభివృద్ధి చెందాలి. నిజామాబాద్ గొప్ప చరిత్ర, సంస్కృతి, సాహిత్య వారసత్వానికి ప్రతీక అని గవర్నర్ అన్నారు. నిజామాబాద్ వ్యవసాయం, విద్య, పరిశ్రమలు, సమగ్ర అభివృద్ధి రంగాల్లో మరింత ముందుకు సాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. ప్రతి పాఠశాల సురక్షితంగా.. ప్రతి యువత చైతన్యవంతంగా.. ప్రతి కుటుంబం నషా దుష్ప్రభావాల నుంచి రక్షితంగా ఉండేలా సమాజం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన యువతే బలమైన సమాజాన్ని నిర్మిస్తుందని, బలమైన సమాజమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. నషాముక్త్ తెలంగాణ.. నషా ముక్త్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా లక్ష మంది సంతకాలు చేసిన యాంటీ డ్రగ్ అవేర్నెస్ ఫ్లెక్సీ నీ ఆవిష్కరించారు. విద్యార్థులు, యువకులతో నషా ముక్త్ ప్రతిజ్ఞ చేయించారు. నషా ముక్త్ భారత్ కింద నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు గవర్నర్ మెమెంటో లు అందించి అభినందించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు హాజరయ్యారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, ఎంపీ అరవింద్, నగర మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పి. రాకేష్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య లు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం

- యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాల ఏర్పాటు : కలెక్టర్ ఆదర్శ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియతో పాటు నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు అంశాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల, సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసేకరణ, పునరావాస కేంద్రాలు, అటవీ భూముల సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా పరిధిలోని పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేశామన్నారు. సమస్యలున్న ప్రాంతాల్లో రైతులతో నేరుగా సంప్రదింపులు జరిపి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పూర్తయిన భూసేకరణకు సంబంధించి అవార్డులు పాస్ చేసి, పరిహారం సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు.

***నిధుల కొరత లేదు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి***

రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణతో పాటు నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లను ఆదేశించారు. అటవీ శాఖ పరిధిలోని భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ, పునరావాస పనుల కోసం ముఖ్యమంత్రి మొదటి విడతలో ₹1,050 కోట్లు, మలి విడతలో ₹6,000 కోట్లు విడుదల చేశారని వెల్లడించారు. ఈ విషయంలో కలెక్టర్లు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పనులను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సంజయ్ జాజు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్, ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్, డిప్యూటీ సీఈ ఎన్. వెంకట్ రెడ్డి, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ తిరుపతయ్య, జి-సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం కార్యక్రమం పర్యావరణ సంరక్షణకు దోహదం చేస్తుంది

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు

నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 25,(విజన్ ఆంధ్ర); మంగళవారం సారంగాపూర్ మండలంలోని ఆడెల్లి పోచమ్మ హరితవనంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా భారీ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, చీఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ అపర్ణ, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని అన్నారు. మనమంతా ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవనం కొనసాగించాలంటే తప్పనిసరిగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన మొక్కలను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని చెప్పారు. మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెంపొందించడమే కాకుండా, ప్రకృతితో బంధాన్ని పెంచుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. మొక్కలు నాటడానికి కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా ఒక యజ్ఞంలా చేపట్టి భావితరాలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలన్నారు.

**ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి**

**జిల్లా ఎస్పీ జానకి షర్మిల**

ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్ననాటి నుండే పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. మనం నాటిన మొక్కలు తరతరాలకు ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. విరివిగా మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని కూడా తగ్గించిన వారమవుతామని తెలిపారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడితేనే మానవాళికి మనుగడ ఉంటుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కంకణ బదులు కావాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు మహిళా సంఘాలు భాగస్వామ్యం కావాలని చెప్పారు.



**అటవీ విస్తీర్ణ లక్ష్యం పెంచేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందివ్వాలి:**

**చీఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ అపర్ణ.**

అటవీ విస్తీర్ణం పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సిసిఎఫ్ బాసర సర్కిల్ అపర్ణ తెలిపారు. భౌగోళికంగా అటవీ ప్రాంతం 33 శాతం ఉండాలని, అప్పుడే పర్యావరణ సమతుల్యత ఉంటుందని అన్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని రక్షించాలని కోరారు. పిల్లల పుట్టినరోజులు, వివాహ దినోత్సవాలు, తదితర శుభకార్యాల సందర్భంగా అతిథులకు మొక్కలు బహుమతులుగా ఇవ్వాలన్నారు. జిల్లాలో ఇప్పటికే వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతుందని తెలిపారు. సింగిల్ యూసేజి ప్లాస్టిక్ ను వాడకుండా ఉండి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని వివరించారు. కళాజాత బృందాలు పర్యావరణ పరిరక్షణ, చెట్లు పెంచడం వల్ల కలిగే లాభాలను సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా వివరించారు. అనంతరం అధికారులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు కలిసి భారీగా మొక్కలను నాటారు. ఈ వనమహోత్సవం కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్ లు కూనేరు భూమన్న, దండు సాయన్న, స్థానిక ప్రజలు, విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని భవిష్యత్తుకు మొక్కలు నాటాలి: కలెక్టర్



ములుగు ఆగస్టు 25, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ వాస్దేవరావు పిలుపునిచ్చారు. గట్టమ్మ సమీప పంచాయతీరాజ్ పైలాన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా కలెక్టర్ హేమంత్, ఎస్పీ సుధీర్, ఐటీడీఏ పీఓ లెనిన్, డీఎఫ్ఓ వికాస్ మీనా మొక్కలు నాటారు. మొక్కలు, అడవులు కాలుష్య నియంత్రణకు, సమతుల్యతకు కీలకమని, నాటిన మొక్కలను సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎఫ్డీఓ సత్తయ్య, జాకారం సర్పంచ్, అధికారులు పాల్గొన్నారు.

# పనులు వేగవంతం చేయాలి: మంత్రి సీతక్క



ములుగు ఆగస్టు 25, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పంటకుంటలు, చెక్డ్యామ్‌ల పనులు వేగవంతం చేసి, ప్రతి పంచాయతీలో రోజూ 60 మందికి ఉపాధి కల్పించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి.. వన మహోత్సవంలో 6.18 కోట్లకు గాను 5.32 కోట్ల మొక్కలు (86%) నాటామని, మిగతా లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసి మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. ములుగు నుంచి అదనపు కలెక్టర్ సంపత్ రావు, డీఆర్డీఓ, డీపీఓ తదితరులు పాల్గొన్నారు.

# జవాన్ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి



ములుగు ఆగస్ట్ 25, విజన్ ఆంధ్ర ప్రతినిధి : నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లికి చెందిన జవాన్ తిప్పని సుధాకర్, సోదరుడు శ్రీనివాస్ ల 8 ఎకరాల భూమిని (సర్వే నం. 3193) క్యాతం ప్రవీణ్ పేరున అక్రమ పట్టా చేశారని, చర్యలు తీసుకోవాలని కోర్నేల్ మాదిగ, ఆకుల సాంబారావు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీలో అలసత్వం వద్దు

**- బూత్ స్థాయి అధికారులకు అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**

**- మున్సిపల్ కార్యాలయంలో శిక్షణా తరగతుల ఆకస్మిక తనిఖీ**




వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల పంపిణీ, క్లియరెన్స్ ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా పారదర్శకత, నాణ్యత సాధించడంలో బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకమన్నారు. మ్యాపింగ్ కాని ఓటర్లకు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసులను క్షేత్రస్థాయిలో సకాలంలో అందజేసి, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలను నిబంధనల ప్రకారం వేగవంతంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా అన్ని కేసులను పరిష్కరించాలన్నారు. పరిశీలన సమయంలో ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. బీఎల్ఓ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో తమ పరిధిలోని సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసి నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# సీఎం వరాన్ని చెడగొట్టిన అధికారుల నిర్లక్ష్యం

**- స్మార్ట్ కార్డుల్లో తప్పుల తడక!**

ఉమ్మడి పాలమూరు జిల్లా, విజన్ ఆంధ్ర, ఆగస్టు 25: పేదలకు గౌరవంగా, పారదర్శకంగా రేషన్ అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు నిజంగా పేదల పాలిట వరం లాంటివి. చిరిగిపోయిన పాత కార్డులకు స్వస్తి పలికి ఏటీఎం కార్డు తరహాలో సరికొత్త స్మార్ట్ కార్డులు అందించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఈ మహత్తర ఆశయాన్ని క్షేత్రస్థాయిలో కొందరు రెవెన్యూ అధికారులు తమ తీవ్ర నిర్లక్ష్యంతో, బాధ్యతారాహిత్యంతో అపహాస్యం చేస్తున్నారు.



శనివారం పలు మండలాల్లో మొదటి విడతగా పంపిణీ చేసిన కార్డులను చూసిన లబ్ధిదారులు షాక్ కు గురయ్యారు. హరిపురం గ్రామానికి చెందిన లబ్ధిదారుడి కార్డుపై ఓదెల అని, రాయగూడెం గ్రామ పంచాయతీకి బదులు బుద్దారం అని, మోటాపురం గ్రామానికి బదులు రాజేశ్వరపురం అని ముద్రించారు. అంతేకాదు అన్ని గ్రామాలకు ఒకే పేరుతో పాటు పోస్టల్ పిన్ కోడ్ నంబర్లు కూడా పూర్తిగా తప్పుగా ముద్రించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రజలు ఆగ్రహంతో నిలదీయడంతో చేసేదేమీ లేక అధికారులు హడావుడిగా కార్డుల పంపిణీని నిలిపివేశారు. సీఎం రేవంత్ రెడ్డి పేదల కోసం ఇంత మంచి కార్యక్రమం తెస్తే, దానిని సక్రమంగా అమలు చేయకుండా ఇలా తప్పులతడకగా ముద్రించడం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే చర్యగా ప్రజలు భావిస్తున్నారు. ఈ తప్పిదానికి బాధ్యులైన అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని, సరైన సమాచారంతో కూడిన స్మార్ట్ కార్డులను తిరిగి పంపిణీ చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

విజన్ ఆంధ్ర

# చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**- జలవనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా గుర్తించాలి.**

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



ములుగు ఆగస్ట్ 25, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లాలోని చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, జలవనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా గుర్తించాలని జిల్లా కలెక్టర్, జిల్లా చిత్తడి నేలల కమిటీ చైర్మన్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి చిత్తడి నేలల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని చిత్తడి నేలల గుర్తింపు, సర్వే, హద్దుల నిర్ధారణ, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తడి నేలలు, జలవనరుల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని జలవనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి విస్తీర్ణం, హద్దులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే, హద్దుల నిర్ధారణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సమగ్ర నివేదికను రాష్ట్ర చిత్తడి నేలల ప్రాధికార సంస్థకు పంపించాలని ఆదేశించారు. జలవనరుల పరిశీలనలో నీటిపారుదల, అటవీ, రెవెన్యూ శాఖలు ప్రధాన బాధ్యత వహించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పురపాలక, కాలుష్య నియంత్రణ మండలి, మత్స్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా క్షేత్రస్థాయి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి జలవనరును స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ సంపత్, డి పి ఓ వెంకయ్య, డి ఏ ఓ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి సంజీవరావు, డి ఆర్ డి ఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా జరిగిన "సింగిడి నృత్యాంగన" నృత్య కళా ఉత్సవం




హైదరాబాద్ ఆగష్టు 2026,విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : దక్షిణ మధ్య మండల సాంస్కృతిక కేంద్రం, నాగ్‌పూర్ (భారత ప్రభుత్వం యొక్క సాంస్కృతిక మంత్రిత్వ శాఖ),తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రముఖ కళా సాంస్కృతిక సంస్థ "సింగిడి" హైదరాబాద్, డైరెక్టర్, డి.ఆర్.కె. విశ్వకర్మ, నేతృత్వంలో ఆనందోత్సాహాల మధ్య ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "4వ నృత్యాంగన " వివిధ నృత్య కళా రూపాల ఉత్సవం స్వదేశీ, విదేశీ కళాకారుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం సాయంత్రం రవీంద్రభారతి ఆడిటోరియం, మెయిన్ హాల్ లో 'సింగిడి సాంస్కృతిక సంస్థ' ఏర్పాటు చేసిన నృత్యోత్సవం లో కన్నుల పండుగగా నిర్వహించిన కార్యక్రమంలో నార్తా డాన్స్, మధ్యప్రదేశ్, యజ్ఞసేని సర్కార్ కోల్‌కతా, రంగిక నానయక్కరా శ్రీ రంగభి కళా మందిర్ శ్రీలంక, తెలంగాణ లంబాడి నృత్యం, మౌమితా పాల్ కోల్‌కతా, శౌరి కొక్కుండ, లండన్, యు కె, కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 120 మంది కళాకారులు తమ అద్భుతమైన నాట్య ప్రతిభను కనబరుస్తూ, నృత్యాంశాలను ప్రదర్శించి అలరించి ప్రేక్షకులను, కళాభిమానులను సమ్మో హితులను చేశారు, చప్పట్ల వర్షం కురిపించారు. ఈ సంధర్భంగా సింగిడి సంస్థ డైరెక్టర్ డి.ఆర్.కె. విశ్వకర్మ మాట్లాడుతూ, మర్చిపోతున్న మన ప్రాచీన నాగరికతను, సంస్కృతిని, కళలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో, అలాగే వివిధ రాష్ట్రాల, దేశాల కళలను ప్రత్యక్షంగా చూపించి వారిలో కళాత్మక శక్తిని, నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో సింగిడి సాంస్కృతిక సంస్థ ఈ 'నృత్యాంగన' కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. శ్రవణానందకంగా, నేత్రపర్వంగా సాగిన ఈ నృత్య కళా వైభవానికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యుడు జితేందర్ రెడ్డి, గౌరవ అతిథిగా పటేల్ రమేష్ రెడ్డి, మాజీ ఛైర్మన్ తెలంగాణ ప్రభుత్వ పర్యాటక అభివృద్ధి సంస్థ, సుధీర్ కుమార్ ఐఆర్‌టిఎస్, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్, రైల్వే మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, డాక్టర్. నమోజు బాలచారి, కార్యదర్శి తెలంగాణ సాహిత్య అకాడమీ, ఇతర అతిథులుగా ఉపాసన చైర్మన్ సాంస్కృతిక సంస్థ సింగిడి యుఎఇ, టి. కిషోర్ యాదవ్ చైర్మన్ సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ ఇటలీ, ఇతర దేశాల సింగిడి సంస్థ ప్రతినిధులు హాజరై కన్నుల పండుగగా నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్న కళాకారులను అభినందించి మొమెంటోలను, ప్రశంశా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కనువిందు చేసిన ఈ చక్కటి 'నృత్యాంగన' నృత్యోత్సవంలో తమను కూడా భాగస్వాములను చేసినందుకు సంస్థ చైర్మన్ విశ్వకర్మ ను , నిర్వాహక కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు అతిథులు తెలుపుతూ, ప్రశంశలు, శుభాకాంక్షలు అందజేశారు.

# మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- వన మహోత్సవంలో భాగంగా 17 లక్షల మొక్కల నాటే లక్ష్యం**

**- సవాయిగూడెం, నాచహళ్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటన**

**- భూగర్భ జలాల పెంపునకు ఫార్మ్ పాండ్ల నిర్మాణం విరివిగా చేపట్టాలి**



*ఫార్మ్ పాండ్లతో భూగర్భ జలాల రీచార్జ్*

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) : మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామంలోని అటవీ శాఖ ప్రకృతి వనంతో పాటు, నాచహళ్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాటిన మొక్కను పరిశీలించి, స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు నిర్దేశించిన 17 లక్షల మొక్కల వన మహోత్సవం లక్ష్యాన్ని సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాటిన ప్రతీ మొక్కకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షణ చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నాచహళ్లి గ్రామంలో రైతు విజయ్ పొలంలో వి బి జి రామ్ జీ కింద నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకునేలా ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి కుంటల ద్వారా భూగర్భ జలాలు రీచార్జ్ అయి, పంటలకు సాగునీటి లభ్యత పెరుగుతుందని తెలిపారు. రైతులు తమ పొలాల వద్ద విస్తృతంగా మొక్కలు నాటి నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో, సవాయిగూడెం సర్పంచ్ యామిని, నాచహళ్లి సర్పంచ్ అబ్దుల్లా, అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదవాలి

**- ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి**

**- బి.సి అభివృద్ధి, సంక్షేమ సలహాదారు వి. హనుమంతరావు**

**- ఎదిరలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో వన మహోత్సవం**





మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎదిరలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బి.సి బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను బి . సి అభివృద్ధి, సంక్షేమ సలహాదారు వి. హనుమంతరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులతో సమావేశమైన సలహాదారు, గురుకుల పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, విద్య, భోజనం తదితర సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ, విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. విద్యార్థులు తమకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని హనుమంతరావు అన్నారు. ముఖ్యమంత్రి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. విద్యార్థులు ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు రానున్న రోజుల్లో సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హనుమంతరావు తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కాగా, జిల్లాకు చేరుకున్న బి.సి అభివృద్ధి, సంక్షేమ సలహాదారు వి. హనుమంతరావుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బి.సి అభివృద్ధి అధికారి విష్ణు నందన్, డి.సి.సి.అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, గురుకుల పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సులభతరంగా బాధితులకు రక్తదాన సేవలు

**- యాప్ లో రిజిస్టర్ అయిన వారికి ఎక్కడినుండి అయినా రక్తదాన సరఫరా**




నిజామాబాద్, ఆగష్టు25:( విజన్ ఆంధ్ర ) : రక్తం కావాలంటే ఇక వాట్సాప్‌లో వెతకాల్సిన అవసరం లేకుండా సులభతరంగా బాధితులకు రక్తదాన సేవలను అందిస్తున్నట్లు వైద్యో యాప్ నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ మిను స్పందన,గుండె శస్త్రా చికిత్స నిపుణులు డాక్టర్ కార్తీక్ వల్లల మాట్లాడుతూ యాక్సిడెంట్, ఆపరేషన్ లేదా ప్రసవ సమయంలో అత్యవసరంగా రక్తం అవసరమైనప్పుడు డోనర్ కోసం సోషల్ మీడియాలో వెతకడం చాలా కష్టంగా ఉంటుందని ముఖ్యంగా అరుదైన బ్లడ్ గ్రూపులకు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా వైద్యో యాప్ లో "బ్లడ్ కనెక్ట్ " సేవను ప్రారంభించారు. పేషెంట్ యాప్‌లో బ్లడ్ గ్రూప్, అవసరమైన యూనిట్లతో బ్లడ్ రిక్వెస్ట్ అని పెట్టగానే, అదే బ్లడ్ గ్రూప్‌కు చెందిన రిజిస్టర్ అయిన డోనర్లకు సమాచారం వెళ్తుందన్నారు. స్పందించిన డోనర్ వివరాలను పేషెంట్‌కు అందిస్తామన్నారు. బ్లడ్ కనెక్ట్ పేషెంట్లకు పూర్తిగా ఉచితంగా ఒక సామాజిక సేవగా అందిస్తున్నామన్నారు. వైద్యో లో డాక్టర్ అపాయింట్‌మెంట్స్, డాక్టర్ సెర్చ్‌తో పాటు హోమ్ హెల్త్‌కేర్, ఫిజియోథెరపీ, నర్సింగ్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఆపరేషన్స్ మేనేజర్ డాక్టర్ . మోనిష్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వంశీ సల్ల లు పాల్గొన్నారు.

# పరిశ్రమల పరిధిలో పచ్చదనం పెంచాలి

**- మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**- పారిశ్రామిక ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణకు విస్తృతంగా మొక్కలు నాటాలి**

**- సి ఎస్ ఆర్ నిధులతో పర్యావరణ పరిరక్షణకు పరిశ్రమలు భాగస్వాములు కావాలి**




దుండిగల్, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశ్రామిక ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు పరిశ్రమల యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్ పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలో పరిశ్రమల శాఖ, ఫ్యాక్టరీల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రణాళికాబద్ధంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు.

**నాటిన మొక్కల సంరక్షణే కీలకం**

ప్రతి పరిశ్రమ తన పరిధిలో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఫైజాన్ అహ్మద్ సూచించారు. మొక్కలు నాటి కార్యక్రమాన్ని ముగించినట్లుగా కాకుండా వాటి పెరుగుదలకు అవసరమైన నీరు, రక్షణ, నిర్వహణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పచ్చదనం పెంపుతో వాతావరణ కాలుష్యాన్ని కొంతమేర నియంత్రించడంతో పాటు పారిశ్రామిక ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పవచ్చన్నారు.

**జూ=తో పర్యావరణానికి చేయూత**

కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధులను పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు వినియోగించేందుకు పరిశ్రమలు ముందుకు రావాలని అదనపు కలెక్టర్ కోరారు. వనమహోత్సవం వంటి పర్యావరణహిత కార్యక్రమాల్లో పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే పచ్చదనం మరింత విస్తరించగలదన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్/జనరల్ మేనేజర్ డి. వినయ్‌కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్‌రెడ్డి, దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ సంస్థ ప్రతినిధులు రమేష్, గోపినాథ్, సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐపిఎస్ అధికారిపై క్రమశిక్షణ చర్యలు

**- విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై విచారణ**

అమరావతి,ఆగస్ట్25 : సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌పై క్రమశిక్షణ చర్యలకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో ఆయన అగ్నిమాపకశాఖ, సీఐడీ విభాగాల్లో విధులు నిర్వర్తించారు. సర్వీసు నిబంధనలు, క్రమశిక్షణ ఉల్లంఘనలపై ప్రభుత్వం రాతపూర్వక వివరణ కోరగా సంజయ్ ఇవ్వలేదు. దీంతో ఆయనపై సాధారణ విచారణ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

విచారణాధికారిగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్‌ను సీఎస్ సాయిప్రసాద్ నియమించారు. నిర్ణీత గడువులోపు విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతేడాది జనవరిలో సంజయ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తన పరిధిలో లేకపోయినా రూ. 1.20కోట్ల వరకు చెల్లింపులు చేసినట్లు ఆయనపై అభియోగాలు ఉన్నాయి. ఈ క్రమంలో 8 అంశాలను ప్రస్తావిస్తూ వివరణ ఇవ్వాలని ప్రభుత్వం సంజయ్‌ను ఆదేశించింది. ఆయన స్పందించకపోవడంతో విచారణ నిర్వహించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

# 'సింగరేణి చెత్త కదలడం కష్టమే'

-కాంట్రాక్ట్ ముగిసి నాలుగు రోజులు

-సిబ్బందిని తగ్గించేందుకు టెండర్ ఆలస్యం




మందమర్రి, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర) : రోజులు గడుస్తున్న కొద్ది రామకృష్ణాపూర్ సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో చెత్త కదలడం కష్టమే అనే మాటలు సివిక్ విభాగానికి చెందిన కొందరి నుంచి వినిపిస్తున్నాయి. సింగరేణిలో ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న సివిక్ సిబ్బందిని తగ్గించేందుకు అధికారులు వివిధ రకాలుగా కుట్రలు పన్నుతున్నారనే ఆరోపణలు ఇటీవల వారి నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ మాటలకు ఉదాహరణే రామకృష్ణాపూర్ సింగరేణి సివిల్ డిపార్ట్మెంట్లో సివిక్ విభాగానికి సంబంధించిన గడువు ముగిసిన కాంట్రాక్ట్ అంశమే ముఖ్య కారణంగా తెలుస్తుంది. కార్మిక క్వార్టర్లలో చెత్తను తరలించేందుకు ఏ జోన్,బీజోన్ రెండు విభాగాలుగా విభజించి అందుకు సంబంధించిన కార్యకలాపాలను ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న సివిక్ కార్మికులు నిర్వహిస్తున్నారు. గడిచిన కొన్ని రోజులుగా బీజోన్ క్వార్టర్ల వైపు చెత్తను తరలించేందుకు సివిక్ కార్మికులు రాకపోవడంతో అసలు కారణం వెలుగులోకి వచ్చింది. బీజోన్ వైపు వచ్చే సివిక్ కార్మికులకు సంబంధించిన కాంట్రాక్ట్ నాలుగు రోజుల క్రితమే గడువు ముగియడంతో చెత్తను తరలించేందుకు వాడల్లోకి రావడం లేదు. సంబంధించిన కాంట్రాక్ట్ గడువు ముగుస్తుందని అధికారులకు ముందే తెలిసినప్పటికీ కావాలనే నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తుంది. సిబ్బందిని తగ్గించే ప్రయత్నంలో భాగంగానే అధికారులు కొత్త టెండర్ వేయకుండా వ్యవహరించారన్న వాదనలు కొందరి నుంచి వినిపిస్తున్నాయి. 2018 సంవత్సరంలో సివిక్ టెండర్ ప్రారంభం కాగా ఎనిమిది ఏళ్లలో ఒక్కసారి కూడా టెండర్ ఆలస్యం కాలేదు. 2026 లో మాత్రం గడువు ముగిసిన తరువాతనే కొత్త టెండర్ ప్రకియను స్టార్ట్ చేశారు. కాంట్రాక్టు గడువు ముగియకముందే మరో టెండర్ వేయాల్సిన అధికారులే వేయకపోవడం పట్ల కార్మిక కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో సింగరేణి సంస్థ,అధికారులు పూర్తిగా వెనుకడుగు వేస్తున్నారనేది కార్మిక వర్గానికి స్పష్టంగా అర్థమవుతుంది. కాగా కాంట్రాక్ట్ గడువు ముగియడంతో సివిక్ కార్మికులకు తీరని నష్టంగా చెప్పవచ్చు. అంతే కాకుండా చాలి చాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న కార్మికులకు టెండర్ ఆలస్యం కారణంగా కుటుంబ పోషణ కొంత భారం కానుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి కార్మిక వాడల్లో చెత్తను నిత్యం తరలించాలంటున్నారు.

# సిబ్బంది నిబద్ధతతో, నిజాయితీతో విధుల నిర్వహణ చేపట్టాలి.

- విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను సక్రమంగా అమలు చేయాలి
- మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.
- సమాజంలో పోలీసు వ్యవస్థ కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా నిజాయితీతో విధులను నిర్వర్తించాలి.
- పోలీస్ స్టేషన్ రికార్డులను, సిబ్బంది పనితీరు పరిశీలన.
- నేరడిగొండ పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.



నేరడిగొండ, ఆగస్టు 25 (విజన్ ఆంధ్ర ) : జిల్లా వ్యాప్తంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. మంగళవారం ఉదయం నేరడిగొండ పోలీస్ స్టేషన్ సందర్శించి సిబ్బంది చేస్తున్న విధులపై పోలీస్ స్టేషన్లో నమోదవుతున్న కేసుల వివరాలను, కేసుల పరిశోధనపై చేసిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి పోలీసు కు కేటాయించిన గ్రామాన్ని సందర్శిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, గుడుంబా, మట్కా, నిర్వహించకుండా చూడాలన్నారు. ఎలాంటి సమాచారమైనా నేరుగా సంబంధిత పోలీసు అధికారులకు అందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పూర్తిగా పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల స్థితిగతులపై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీ నిబద్ధతతో విధుల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరికి జవాబుదారీతనం మరియు క్రమశిక్షణ, సమయపాలన, తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సమాజంలో పోలీసు వ్యవస్థకు ఉన్నత స్థానాన్ని కల్పించే విధంగా విధులను నిర్వర్తిస్తూ ఆదిలాబాద్ జిల్లా పోలీసు కీర్తిని పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఉండే ప్రతి ఒక్క సిబ్బందికి సమానమైన విధులను కేటాయించేలా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా ప్రతిరోజు సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, ఫిర్యాదు వచ్చిన వెంటనే గ్రామానికి కేటాయించిన పోలీసు అధికారిని విచారణ నిమిత్తం కేటాయించి బాధితులకు సరైన సమయంలో న్యాయం చేకూర్చే విధంగా చూడాలన్నారు. పిటిషన్ మేనేజ్మెంట్ పై సిబ్బంది ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్లూ కోర్ట్, డైల్ 100/112 విధులను ప్రతివారం పర్యవేక్షిస్తూ మండల పరిధిలో ఎలాంటి మైనర్ డ్రైవింగ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. మండలంలో ముఖ్యంగా గంజాయి లేకుండా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది సమాజ శ్రేయస్సుకై కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఫింగర్ ప్రింట్ పరికరాన్ని ఉపయోగించి అనుమానితుల్ని, నేరస్థులను వేలిముద్రలను సేకరించి పరిశీలించాలని తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సి ఈ ఐ ఆర్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేస్తూ బాధితులకు భరోసాని అందించాలని తెలిపారు. సిబ్బంది కి ఎలాంటి సమస్యలున్న తెలియజేయాలన్నారు. నూతన సిబ్బంది సీనియర్ల వద్ద పోలీస్ స్టేషన్లో ఉండే విధులను రికార్డుల నిర్వహణను నేర్చుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు. అదేవిధంగా కుప్టి బ్రిడ్జిపై ఏర్పడిన గుంత కారణంగా వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన మరమ్మత్తులు చేసి తిరిగి బ్రిడ్జిని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ రూరల్ సిఐ సిహెచ్ రమేష్, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అంటేనే నమ్మకం కలిగిస్తున్న హెచ్ఎం ప్రసూన

## కల్వకుర్తి ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చిన ప్రధానోపాధ్యాయురాలు

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర,ఆగస్టు 25: ప్రభుత్వ పాఠశాల అంటేనే చిన్నచూపు చూసే రోజులు పోయాయి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా, అన్ని రంగాల్లో దూసుకుపోతూ నమ్మకాన్ని కలిగిస్తోంది కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఇందుకు ప్రధాన కారణం హెచ్ఎం ప్రసూన మరియు ఉపాధ్యాయుల కృషి. 2023 సెప్టెంబర్ లో హైదరాబాద్ లో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తూ ప్రమోషన్ పై కల్వకుర్తి ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన ప్రసూన, వచ్చినప్పటి నుండి తన మార్క్ చూపిస్తున్నారు. ఉపాధ్యాయులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు.




కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల....



పాఠశాల హెచ్ఎం ప్రసూన...

### దాతల సహకారంతో అభివృద్ధి పనులు:

ఉపాధ్యాయుడు జయప్రకాష్ సహకారంతో మూడు లక్షల రూపాయలతో పాఠశాలలో స్టేజ్ నిర్మాణం చేయించారు. దాతల సహకారంతో ఫస్ట్ ఫ్లోర్ కు ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కమ్యూనిటీ డెవలప్మెంట్ సంస్థ సహకారంతో త్వరలో భారీ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

### విద్యార్థుల సమగ్ర వికాసానికి కార్యక్రమాలు:

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ లో 100 శాతం ఫలితాలు, సంకల్ప సిద్ధి ప్రోగ్రాం, ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ మరియు పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ద్వారా సమ్మర్ క్యాంపులు, చెస్ బోర్డుల పంపిణీ, మానవతా ఫౌండేషన్ ద్వారా ఆగస్టు 15న సైకిళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ తరపున నోట్ బుక్స్, యోగా టీచర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. బాగా చదివే విద్యార్థులను ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో శ్రీహరికోటకు కూడా తీసుకెళ్లారు.



పాఠశాల ఆవరణలో పెంచుతున్న మొక్కలను చూపిస్తున్న హెచ్ఎం...



కూరగాయలను పండించడానికి ఆవరణలోని ఒక భాగంలో దున్ని ఉంచిన స్థలం....

### ప్రకృతితో మమేకం:

సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సహకారంతో 21 రకాల ఔషధ మొక్కలతో 100 మొక్కలు పెంచుతున్నారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా కూరగాయలు పండిస్తున్నారు. గత సంవత్సరం కూరగాయల అమ్మకం ద్వారా వచ్చిన మూడు వేల రూపాయలతో ఒక తరగతి గదికి ఐరన్ డోర్ ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలోని పూల, తులసి మొక్కలతో విద్యార్థులచే ధూప్ స్టిక్స్ కూడా తయారు చేయిస్తున్నారు.



భోజనశాల వద్ద కిచెన్ షెడ్యూల్ నిర్మాణం....

### ప్రభుత్వ సహకారం:

పాఠశాలలో అగ్రికల్చర్ ఒకేషనల్ ల్యాబ్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సెక్టార్ కోర్సులు ప్రారంభమయ్యాయి. గత రెండు మూడు సంవత్సరాలుగా ఇన్స్పైర్ అవార్డు కూడా వస్తోంది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక నిధులతో పాఠశాల భవనానికి పెయింటింగ్, కిచెన్ షెడ్, విద్యార్థుల కోసం హ్యాండ్ వాష్ నిర్మించారు. ఉదయం మార్నింగ్ వాక్ కు వచ్చే ప్రజలకు ఉపయోగపడేలా పాఠశాల ఆవరణను తీర్చిదిద్దారు. విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు, పోలీసులు, ఇతర అధికారులతో డ్రగ్స్, మద్యం, భవిష్యత్తు కార్యాచరణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తన సొంత పిల్లల్లా చూసుకుంటూ, వారి భవిష్యత్తు కోసం పాటుపడుతున్న హెచ్ఎం ప్రసూన కు, ఉపాధ్యాయ బృందానికి కల్వకుర్తి పట్టణ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు.



ఓపెన్ జిమ్ లో ఆడుకుంటున్న పాఠశాల విద్యార్థులు....

# ఊరుకొండ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో దోపిడీ.. భక్తుల ఆవేదన!

- పూజల పేరుతో రూ.300 నుండి రూ.1000 వరకు వసూళ్లు - సోషల్ మీడియాలో వైరల్
- అసలు అర్చకులు ఎవరు? అవుట్ సోర్సింగ్ పూజారులా? ఎండోమెంట్ ప్రధాన అర్చకులా?

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర,ఆగస్టు 25:**

ఉమ్మడి పాలమూరు జిల్లాల ప్రజల ఇలవేల్పు, స్వయంభువుగా వెలిసిన ఊరుకొండ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న తీరుపై భక్తులు భగ్గుమంటున్నారు. భూత, ప్రేత బాధలను పోగొట్టే స్వామి వారి దగ్గర మొక్కులు చెల్లించుకోవడానికి,వాహనాల పూజ చేయడానికి,రాత్రి నిద్ర చేయడానికి వచ్చే భక్తుల నుండి అయ్యగార్లు అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం అవుతున్నాయి.

### ఎంత వసూలు చేస్తున్నారంటే..

భక్తుల ఆరోపణల ప్రకారం, ప్రతి శనివారం జరిగే రథాల పూజల్లో మొదటి బంతిలో పూజకు రూ.300, రెండవ బంతిలో రూ.500, మామూలు రోజుల్లో రథం చేస్తే రూ.500 నుండి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. వాహన పూజలకు అయితే రూ.500 నుండి రూ.2000 వరకు గుంజుతున్నారని భక్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

### సీఎం వచ్చినా మారని తీరు..

తన రాజకీయం మిడ్జిల్ మండలం నుండే మొదలైందని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఊరుకొండ పబ్బతి ఆలయాన్ని దర్శించుకుని, ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లతో శంకుస్థాపనలు చేశారు. సీఎం వస్తున్నారనే సమాచారంతో అయ్యగార్ల తీరు మారుతుందని అందరూ భావించారు. కానీ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు లేదని భక్తులు వాపోతున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్వయంగా అయ్యగార్ల తీరు మార్చుకోవాలని గతంలో హెచ్చరించినా ఫలితం లేదని సమాచారం. ఇటీవల ఆలయ కమిటీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి స్వయంగా ఆలయం ముందే వీడియో తీసి, అయ్యగార్లు ఎవరినీ లెక్క చేయకుండా దోచుకుంటున్నారని సోషల్ మీడియాలో బహిరంగంగా ఆరోపించడంతో వివాదం మరింత ముదిరింది.



### అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏంటి?

ఈ ఆలయం ఎండోమెంట్ లోకి వెళ్లి 50-60 ఏళ్లు దాటింది. ఎంతమంది ఈవోలు మారినా అయ్యగార్ల తీరు మారడం లేదనే విమర్శ ఉంది. అసలు ఆలయంలో ప్రధాన అర్చకులు ఎవరు? అవుట్ సోర్సింగ్ పూజారులు ఎవరు? అక్కడ ఏం జరుగుతోందని ఒక్క అధికారి కూడా ప్రశ్నించడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయా? అధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఈ దోపిడీ కారణంగా కల్వకుర్తి, జడ్చర్ల చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రతి శనివారం భారీగా వచ్చే భక్తులు ఇప్పుడు ఊరుకొండ ఆలయానికి రావడం మానేసి, మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్తున్నారని సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఆలయంలో అయ్యగార్లు తప్ప భక్తులే ఉండరనే చర్చ జోరుగా సాగుతోంది. దీనిపై ఎండోమెంట్ అధికారులు వెంటనే స్పందించి, విచారణ జరిపి భక్తులకు న్యాయం చేయాలని, పారదర్శకంగా పూజా రుసుముల పట్టికను ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



# రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది.

- పసుపు విలువ ఆధారిత ఉత్పత్తులతో రైతుల ఆదాయం పెంచాలి.
- పసుపు రైతులతో ముఖాముఖిలో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా
- 'సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను ప్రారంభించిన గవర్నర్.



నిజామాబాద్, ఆగస్టు25:( విజన్ ఆంధ్ర) : రైతుల సంక్షేమమే రాష్ట్ర, దేశ సంక్షేమమని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, బలమైన మార్కెట్ అనుసంధానంతో రైతుల ఆదాయాన్ని పెంచాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో "సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. ఉత్తమ రైతు సంఘాలకు గవర్నర్ మెమంటో లు అందించి అభినందించారు. అనంతరం గవర్నర్ పసుపు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. నిజామాబాద్‌కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని గవర్నర్ అన్నారు. సారవంతమైన నేలలు, రైతుల కష్టంతో ఈ ప్రాంతం దేశంలోని ప్రముఖ పసుపు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందన్నారు. ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావడం ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశీస్సులతో ఇది సాకారం అయ్యిందన్నారు. సాగును లాభదాయకంగా మార్చేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. పసుపు కేవలం వ్యవసాయ ఉత్పత్తి మాత్రమే కాదని.. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆయుర్వేదం, ఆధ్యాత్మికత, నిత్యజీవితంతో ముడిపడిన విలువైన సంపద అని గవర్నర్ పేర్కొన్నారు. భారతదేశ వ్యవసాయ వారసత్వానికి పసుపు ప్రతీకగా నిలుస్తోందన్నారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారుగా కొనసాగించడంతో పాటు.. పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే జాతీయ పసుపు బోర్డు లక్ష్యమని గవర్నర్ అన్నారు. పసుపు పండించే రైతుకు కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించడంతో పాటు.. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత పసుపుకు ప్రత్యేక గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు నాణ్యత పెంపు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటకోత అనంతర నిర్వహణపై శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. బాయిలర్లు, పాలిషర్లు, చిన్నతరహా ప్రాసెసింగ్ యూనిట్లు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు విలువ ఆధారిత ఉత్పత్తుల దిశగా దోహదపడతాయని తెలిపారు. సహజ వ్యవసాయం, ఎగుమతుల ప్రోత్సాహానికి దోహదపడే దూరదృష్టితో 'సునహరీ మిట్టీ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. రసాయన ఎరువులు, ఇతర ఇన్‌పుట్లపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా నేల సారాన్ని కాపాడటంతో పాటు.. పర్యావరణ పరిరక్షణ, సాగు వ్యయాన్ని తగ్గించేందుకు సహజ వ్యవసాయం తోడ్పడుతుందని అన్నారు. అవశేష రహిత, నాణ్యమైన పసుపుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని.. నాణ్యతకు ప్రాధాన్యమిస్తే రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు విదేశీ మార్కెట్లకు చేరుకునే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలు రైతులను నేరుగా దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులతో అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తాయని గవర్నర్ అన్నారు. మార్కెట్ అవసరాలు, నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు.. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. రైతులు, శాస్త్రవేత్తలు, ఎగుమతిదారులు, పరిశ్రమలు, ప్రభుత్వాలు సమష్టిగా పనిచేస్తే భారత పసుపును ఆసియా, యూరప్, అమెరికా మార్కెట్లలో మరింత బలోపేతం చేయవచ్చని గవర్నర్ అన్నారు. రైతులు కేవలం పంట ఉత్పత్తిదారులు మాత్రమే కాదని.. దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని గవర్నర్ పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, నాణ్యమైన పంటను పండిస్తూ, సమష్టి మార్కెటింగ్ ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. "అన్నదాత సుఖీభవ" స్ఫూర్తితో రైతు సంపన్నుడిగా, నేల ఆరోగ్యంగా, ప్రపంచ మార్కెట్‌లో భారత్ అగ్రగామిగా నిలిచే వ్యవసాయ వ్యవస్థను నిర్మించాలి అని గవర్నర్ ఆకాంక్షించారు. ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ఈ ప్రాంత పసుపు రైతుల నాలుగు దశాబ్దాల కలను నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో కేంద్రం నెరవేర్చిందన్నారు. బోర్డు ఏర్పాటు తో పసుపు రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. పసుపు క్వింటాలు ఇచ్చే రేటు గతం కంటే పెరిగిందన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నగర మేయర్ ఉమారాణి,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పి. రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానీ , నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య లు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.